RNI Reg-No.APTEL/2005/19204

ESTD : 1996

# నేటి మనదేశమ్

తెలుగు దినపత్రిక

Simultaneously published from Tirupati, Vijayawada, Visakhapatnam & Hyderabad

సంపుటి :21 సంచిక 156 తిరుపతి సంపాదకులు: కె.యస్.రంగశాయి శనివారం 6-6-2026 పేజీలు :8 వెల: 1-00

శ్రీ పరాభవ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు,జ్యేష్ఠ మాసం, తిథి॥ షష్ఠి రా॥10.02, ధనిష్ఠ తె॥3.58, వర్జ్యం ఉ॥6.56 -8.37, దుర్ముహూర్తం ఉ॥ 5.28-7.12, శుభ సమయం ఉ॥ 6.00-7.30, రాహుకాలం ఉ॥9.00-10.30, సూర్యోదయం ఉ॥ 5.28, సూర్యాస్తమయం సా॥ 6.27 గం॥


## మెగా డీఎస్సీలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు



**అమరావతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మెగా డీఎస్సీని పారదర్శకంగా నిర్వహిం చామని ఏపీ ప్రభుత్వ అధికారులు స్పష్టం చేశారు. డీఎస్సీ నియామకాలపై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్ మీడియాతో మాట్లాడుతూ వివరణ ఇచ్చారు. డీఎస్సీ ప్రక్రియలో నియమ, నిబంధలన్నీ పాటించినట్లు చెప్పారు. సుప్రీంకోర్టు మిగతా 2లో..

## ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

తల్లి పేరుతో ఒక్కొక్కరు ఓ మొక్క నాటాలి: మూలపాడు పార్క్‌లో మొక్క నాటిన పవన్



**అమరావతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ధరిత్రి రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మనం నాటే ప్రతి మొక్క మహావృక్షం కావా లని ఆయన ఆకాంక్షిం చారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా మూలపాడులోని బటర్‌ఫ్లై పార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పవన్ కల్యాణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తన తల్లి అంజనా దేవి పేరిట తెల్లపొణికి మొక్కను ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాటడం ద్వారా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. వర్షా కాలంలో రాష్ట్రమంతటా సీడ్ బాల్స్ చల్లడానికి మాస్టర్ ప్లాన్ సిద్ధం చేసినట్లు చెప్పారు. 'ఏక్ పేడ్ మా కే నామ్' థీమ్ స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరిట మొక్క నాటాల్సి ఉందన్నారు. ప్రతి చెట్టు వాతావరణ మార్పులపై రక్షణ కవచంగా నిలవాలని పేర్కొన్నారు.

చెట్లు నాటడం ద్వారా రాష్ట్రాన్ని పచ్చగా మార్చి.. వాతావరణ మార్పుల నుంచి భూమిని కాపాడుకుందామని మానవాళికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.




# సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం

- ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఉత్పత్తి
- బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుంది
- సముద్ర ఉత్పత్తులకు కేంద్రం సహకారం ఉండాలి
- నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ వర్క్‌షాపులో సిఎం చంద్రబాబు

**విశాఖపట్టణం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** భారతదేశంలో సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ప్రతి ఏటా 197 లక్షల మెట్రిక్ టన్నుల సీ-ఫుడ్ ఏపీ నుంచి ఉత్పత్తి అవుతోందని పేర్కొన్నారు. ఏపీలో బ్లూ ఎకానమీ పెరిగితే దేశ ప్రగతికి దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. విశాఖలో సీ-ఫుడ్ ఎగుమతుల జాతీయ వర్క్‌షాప్ ఘనంగా ప్రారంభ మైంది. సీఎం చంద్రబాబు నాయుడు మిగతా 2లో..

## మా హయాంలో 'లీక్'లు లేవు

– ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** దేశంలో తరచూ తలెత్తుతున్న ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారాలపై ఆప్ అధినేత, మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ మరోసారి మండిపడ్డారు. ప్రశ్నాపత్రాల లీక్ వెనుక బిలియన్ల విలువ చేసే వ్యాపారాలు నడుస్తున్నాయని.. ఇందులో చాలా పెద్ద వ్యక్తుల హస్తం ఉందని ఆరోపించారు. భాజపా అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ప్రతి మూడేళ్లకు ఒకసారి పేపర్ లీక్‌లు ఎందుకు అవుతున్నాయని ప్రశ్నించారు. పంజాబ్‌లో ఆప్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగేళ్లైనా ఒక్క లీక్ కూడా జరగలేదన్నారు. తమ పార్టీ దిల్లీలో అధికారంలో ఉన్న పదేళ్లపాటు అక్కడ కూడా ఎటువంటి లీక్‌లు చోటుచేసుకోలేదని తెలిపారు. భాజపా అధికారంలోకి మిగతా 2లో..

## పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

విజయవాడలో సైకిల్ తొక్కిన హోం మంత్రి అనిత



**విజయవాడ, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం, నో వెహికల్ డే సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో సహా ప్రజా ప్రతినిధులు సైకిల్ తొక్కారు. అలానే రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత విజయవాడలో తన నివాసం నుంచి ఆటోనగర్ ఫైర్ స్టేషన్ వరకు సైకిల్ తొక్కారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రోజూ ఓ గంట పాటు సైకిల్ తొక్కడం వల్ల ఓవైపు ఆరోగ్యం, మరోవైపు పర్యావరణం బాగుపడతాయని తెలిపారు. ప్రధాని పొదుపు మంత్రంలో భాగంగా సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశా నిర్దేశ మిగతా 2లో..

## అన్నామలై రాజీనామా ఆమోదం



**న్యూఢిల్లీ, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** ఇటీవలే అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తమిళనాడులో రాజకీయాలు మరోసారి రసవత్తరంగా మారాయి. ఈ రాష్ట్ర భాజపా మాజీ అధ్యక్షుడు కె.అన్నామలై పార్టీని వీడారు. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. ఆయన రాజీనామాను భాజపా జాతీయాధ్యక్షుడు నితిన్ నబిన్ శుక్రవారం ఆమోదించారు. కొత్త పార్టీ ఏర్పాటు దిశగా అన్నామలై ప్రయత్నాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. 'తమిళగ మక్కల్ కళగం' లేదా 'తమిళగ మక్కల్ కట్చి' అనే పేరుతో పార్టీని స్థాపించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆయన 'వియ్ లీడర్స్' అనే ట్రస్టును నిర్వహిస్తున్నారు. దీన్ని మరింత విస్తరించి రాజకీయ ఉద్యమంగా మార్చే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. కర్ణాటక క్యాడర్ ఐపీఎస్ అధికారిగా ఉన్న అన్నామలై.. 2019లో ఉద్యోగానికి రాజీనామా చేసి, మోదీ పాలన స్ఫూర్తితో 2020లో భాజపాలో చేరారు. అప్పటినుంచి తమిళనాడులో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, అధ్యక్షుడిగా సేవలందించారు. పాదయాత్ర చేసి పార్టీ విస్తరణకు కృషి చేశారు. అయితే, ఇటీవల జరిగిన ఎన్నికల్లో భాజపా.. అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకున్న సంగతి తెలిసిందే. దీనిపై అన్నామలై అసంతృప్తి వ్యక్తంచేసినట్లు సమాచారం. ఈ క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించడం, ఎన్నికల్లో టికెట్ ఇవ్వకపోవడం రాజీనామాకు కారణమైనట్లు సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి.

## వడ్డీరేట్లు యథాతథం

– ద్రవ్యపరపతి విధానం ప్రకటించిన ఆర్‌బిఐ – ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా వెల్లడి

**ముంబై, జూన్ 5 (ఆర్ఎన్ఎ):** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్‌బీఐ కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తు న్నట్లు తెలిపారు. కీలక వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్‌లో జరిగిన సమీక్షల్లోనూ ఈ వడ్డీరేట్లను రిజర్వ్ బ్యాంక్ యథాతథంగా ఉంచిన సంగతి తెలిసిందే. అయితే, గతేడాది మాత్రం వీటిని పలుమార్లు సవరించింది. 2025 ఫిబ్రవరి, ఏప్రిల్‌లో కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్ల మేర తగ్గించిన ఆర్‌బీఐ.. జూన్ సమీక్షలో ఏకంగా 50 బేసిస్ పాయింట్లు కోత పెట్టింది. ఆ తర్వాత డిసెంబరులో మరో పావుశాతం తగ్గించింది. దీంతో గతేడాది మొత్తంగా రెపో రేటు 1.25 శాతం వరకు




దిగొచ్చింది. సవాళ్ల నడుమ ప్రపంచ ఆర్థికవ్యవస్థ అనిశ్చితిలో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో మనకు ఎదురయ్యే ఆటుపోట్లను తక్కువ నష్టంతో తట్టుకోగలమని విశ్వాసంతో ఉన్నాం. ఇంధన ధరలు అధికంగా ఉండటంతో వృద్ధి నెమ్మదించింది. ద్రవ్యోల్బణం పెరుగుతోంది. దీనికి తోడు ఈ ఏడాది వర్షపాతం సాధారణం కన్నా తక్కువ ఉండటం కూడా ప్రభావం చూపించనుంది. అయితే, ఆహార నిల్వలు సరిపడా ఉండటం మిగతా 2లో..

## బొల్లా బ్రహ్మనాయుడు కాంచీపురంలో అరెస్ట్

– హైదరాబాద్‌కు తరలింపు

– వైకాపా నేతపై పలు సెక్షన్ల కింద కేసులు



**హైదరాబాద్, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** నగరంలో గండిపేట ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ప్రధాన నిందితుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో అతడిని శుక్రవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అతడిని హైదరాబాద్ తీసుకువచ్చారు. నిందితుడిని పోలీసులు కోర్టులో హాజరుపర్చ నున్నారు. నార్సింగి పోలీసులు, సైబరాబాద్ ఈవోడబ్ల్యూ సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో బొల్లా బ్రహ్మనాయుడును అరెస్ట్ చేశారు. మిగతా 2లో..

## సైకిల్ తొక్కిన ముఖ్యమంత్రి

– ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సవారీ

– ఆంధ్రా వర్సిటీలో మొక్కలు నాటిన సీఎం చంద్రబాబు



**విశాఖపట్నం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలుగుదేశం నేతలు ఉత్సాహంగా సైకిలెక్కారు. చంద్రబాబు సహా నేతలంతా సైకిల్ తొక్కి పర్యావరణాన్ని ప్రచారం చేశారు. విశాఖలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. ఐదున్నర కిలో మీటర్ల దూరాన్ని 21 నిమిషాల 18 సెకండ్లలో చేరుకున్నారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్ నుంచి నోవాటెల్ వరకు సీఎం సైకిల్ సవారీ చేశారు. త్రీ టౌన్ పోలీస్ స్టేషన్, పోలమాంబ గుడి, వాల్తేరు, బీచ్ రోడ్ మీదుగా నోవాటెల్‌కు ముఖ్యమంత్రి చేరుకున్నారు. ఎర్రటి ఎండ కాస్తున్నా ఉత్సాహంగా సైకిల్ తొక్కారు. సైకిల్ తొక్కుతూ ప్రజలకు అభివాదం చేసుకుంటూ సీఎం సైకిల్ ప్రయాణం సాగింది. సైకిల్ ర్యాలీలో సీఎం చంద్రబాబు వెంట జిల్లా ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలు ఉన్నారు. శ్రీకాకుళంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విజయవాడలో హోంమంత్రి అనిత కూడా సైకిలెక్కారు. విశాఖ ఏయూ గ్రౌండ్స్‌లో నిర్వహించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ముఖ్యమంత్రి మిగతా 2లో..

నీ ప్రతి పనిలోనూ ఆచరణాత్మకతను కనబరచు. ఆచరణ కొరవడిన అనేక సిద్ధాంతాల వల్లే దేశం పూర్తిగాఆ భ్రష్టుపట్టింది.

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# ఏటేటా పెరుగుతున్న పర్యావరణ విధ్వంసం!

ఏటా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నా..మన వాతావరణంలో మార్పులు రావడం లేదు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏటా జూన్ 5న మొక్కలు నాటడం, ఫోటలకు పోజులు ఇవ్వడం, సైకిల్ తొక్కడం వంటివన్నీ చేస్తున్న పాలకులు చిత్తశుద్ధితో పర్యావరణ పరిరక్షణ చర్యలకు పూనుకోవడం లేదు. పర్యావరణ విధ్వంసాన్ని ఆపేందుకు ఉపక్రమిచకపోవడం వల్ల ఎల్‌నినో లాంటి సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఈ యేడు కూడా నైరుతి ఆలస్యంగా ప్రవేశించింది. ఇంకా ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఒకప్పుడు జూన్ మాసం వచ్చే వరకు జోరు వర్షాలు పడేవి. కానీ ఆ పరిస్థితి ఇప్పుడు ఎక్కడా కానరావడం లేదు. పెరుగుతన్న జనాభే పర్యావరణ విధ్వంసానికి మొదటి చేటుగా గుర్తిచాలి. పెరిగన జనాభా తమ అవసరాల కోసం పర్యవరణ విధ్వంసానికి పాల్పడుతోంది. దీనికి పాలకులే బాధ్యత వహించాలి. ఊరూరా చెరువులను మింగేస్తున్నారు. ఇసుకను,మట్టిని తోడస్తున్నారు. చెట్లను ఎడాపెడా నరికేస్తున్నారు. అడవులను ధ్వంసం చేస్తున్నారు. కొండలను ఆనవాళ్లు లేకుండా చేసేస్తున్నారు. నదీ, సముద్ర జలాలను కలుషితం చేస్తున్నారు. నాలాలను ఆక్రమిస్తున్నారు. ఇవన్నీ కూడా పర్యావరణ విధ్వంసానికి పరాకాష్ఠగా చూడాలి. పర్యావరణం అంటే భూమి, నీరు, గాలి, చెట్లు, జీవ జంతు జాతుల రూపంలో మన చుట్టూ ఉన్నది ప్రకృతి అని అర్థం చేసుకోలేక పోతున్నాం. అడవుల విధ్వంసం వల్ల చిరుతలు, పెద్దపులుల జానావాసాల్లోకి వచ్చి పడుతున్నాయి. పంచభూతాలను రక్షించుకోవడం అన్నది మానవ మనుగడకు, అభివృద్ధికి అత్యంత ఆవశ్యకం. మన చుట్టూ ఉన్న బాహ్య పర్యావరణం, రెండవది అంతర్గత పర్యావరణం. ఈ రెండింటినీ కూడా భగవంతుడే సృష్టించాడు. ఈ రెండింటి మధ్య సంబంధం ఉంది. దానిని మనం అర్థం చేసుకోవడం లేదు. పర్యావరణంలో జీవనానికి హాని కలిగించే భౌతిక, రసాయనిక, జీవ సంబంధమైన పదార్థాలు అవసరానికి మించిన పరిమాణంలో పోగయ్యాయి. దీనివల్ల ప్రతీ చోట వీటి సాంద్రత పెరిగి, పర్యావరణంలో అసమతుల్యత ఏర్పడి కాలుష్యం సంభవిస్తోంది. అందుకే నేడు ఈ పర్యావరణానికి నష్టం వాటిల్లుతోంది, దీనికి కారణం కాలుష్యం. హోలీ, దీపావళి, శరత్ పూర్ణిమ, వైశాఖి, మకర సంక్రాంతి, జన్మాష్టమి,రామ నవమి వంటి పర్వదినాలు ఆయా ఋతువులను అనుసరించి ప్రకృతి గొప్పతనాన్ని, సౌందర్యాన్ని మనకు తెలియ చేస్తున్నాయి. భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యదేవునిగా కొలిచారు. భారతీయ సంస్కృతిలో జలాన్ని కూడా దేవీ స్వరూపం గా భావించారు. నదులను జీవనదాయిని అయిన మాతలుగా భావించారు. అందుచేతనే ప్రాచీన సంస్కృతి నదీ తీరాల వెంబడి ఉద్భవించి ముందుకు కొనసాగింది. భారతీయ సంస్కృతిలో అరటి, రావి, మర్రి, తులసి, మామిడి మొదలైన చెట్లను పూజిస్తారు. వీటిని రక్షించుకోవడం కోసమే వీటిని పూజించేవారు. చెట్టు జాతులను ఇలా పూజించి రక్షించుకోవడం మన సంస్కృతికి మూలాధారం. పర్యావరణం అంటే మనల్నీ, మనపరిసరాలనూ, చెట్టూ,పుట్టా, గాలీ, నీరు, కొండాకోనా, వాగూవంకా,పిట్టాపిచికా, అన్నిటినీ రక్షించుకోవడం అన్న అర్థంలో చెప్పారు. అయితే కాలక్రమేణా మనమే మన పరిసరాలను దెబ్బతీసు కుంటూ వస్తున్నారు. ఏది చేసినా ఆలోచన చేయడం లేదు. పాలకుల విధ్వంసకర విధానాలవల్ల భారతదేశంలో పర్యావరణం దెబ్బతింటోందనడంలో సందేహం లేదు. పర్యావరణ పరిరక్షణలో కఠిన చట్టాలు ఉండాల్సిందే. వాటిని అమలు చేయాల్సిందే. కానీ అలా జరగడం లేదు. జూన్ 5న విశ్వవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం జరుపుకుంటారు. దీన్ని పురస్కరించుకొని ఐక్యరాజ్య సమితి అంతర్జాతీయ పర్యావరణ కార్యక్రమాలు నిర్వహిస్తూ జాగ్రుతపరిచే ప్రయత్నాలు చేస్తుంది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఐక్యరాజ్యసమితి 1972లో ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐక్యరాజ్యసమితి ప్రపంచ సమ్మేళనం ఒకటి నిర్వహించింది. అన్ని దేశాలను ఆహ్వానించింది. స్వీడన్ లో నిర్వహించిన ఈ సమ్మేళనంలో సుమారు 119 దేశాలు పాల్గొన్నాయి. అలా ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం జరుపుకుంటున్నాం. ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యం ప్రజలకు పర్యావరణం పట్ల అవగాహన కలిగించడం అని వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. భూగోళంపై 80శాతం జలం విస్తరించి ఉంది. అయినప్పటికీ తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీరు దొరకడం లేదు. స్వచ్ఛమైన నీటి లభ్యత మూడు శాతం కంటే తక్కువగా ఉంది. ఎక్కువ శాతం నీరు కలుషితమై లేదా ఉప్పు నీటి రూపంలో ఉంది. లభించే కొద్దిపాటి శుద్ధజలం మానవ చర్యలవల్ల పనికిరాకుండా పోతోంది. దీనివల్ల కేవలం మనుషులేకాక సమస్త ప్రాణికోటి, ముఖ్యంగా జలచరాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. భూగర్భజల కాలుష్యాన్ని ఆపడానికి మనం తీవ్రంగా ప్రయత్నం చేయాల్సి ఉంటుంది. ఎందుకంటే వ్యవసాయానికి, త్రాగడానికి స్వచ్ఛమైన నీరు అత్యంత ఆవశ్యకం. జలాన్ని సంరక్షించడం, పరిశుభ్రంగా ఉంచడం మనందరి నైతిక బాధ్యత. మన సంస్కృతిలో నదులను మాతగా పూజిస్తారు. కానీ తల్లిగా భావించే గంగ, యమున, గోదావరి వంటి నదుల పరిస్థితి ఎంత దారుణంగా ఉందో చూడవచ్చు.నివాస ప్రాంతాల నుంచి వచ్చే వ్యర్థాలు, చెత్త చెదారం, పరిశ్రమల నుండి వచ్చే విషతుల్య రసాయనాలు నదులలో కలుస్తున్నా, పాలకులు పట్టించుకోవడంలేదు. ప్రజలు అంతకు మించి అన్నట్లు మిన్నకుంటున్నారు. దీని పర్యవసానంగా దేశంలో ఉన్న ప్రముఖ నదులన్నీ పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. కాబట్టి నదులను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. వృక్షాలను నిర్దాక్షిణ్యంగా నరికి వేయడం కారణంగా నీటిని సంరక్షించే వృక్షజాతులు తరిగిపోయి అనావృష్టి సమస్య ఉత్పన్నమవుతుంది. కాబట్టి పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటాలి. నదుల కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ వాటిని సంరక్షించుకోవాలి. ప్రస్తుతం పెరుగుతున్న పట్టణీకరణ, వాహనాల నుండి వచ్చే పొగతో వాయు కాలుష్యం పెరిగిపోతోంది. మానవ ప్రేరిత చర్యల వల్ల వాతావరణంలో కొన్ని విషపూరితమైన వాయువులు చేరి, ప్రాణవాయువు తగ్గిపోతోంది. మనకు జీవితాన్ని ప్రసాదించి, జీవనం కోసం ఉపయోగ పడుతున్న భూమిని తన స్వార్థ ప్రయోజనాలు, సుఖభోగాల కోసం అనేక రకాలుగా నష్టపరుస్తున్నాడు. ఆహారం, జీవనాన్ని ఇచ్చే భూమిని నాశనం చేస్తున్నాడు. గృహ వ్యర్థాలు, చెత్తాచెదారం వల్ల భూసారం దెబ్బ తింటోంది. మన దేశంలో ప్రతి రోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువగా చెత్త ఉత్పత్తి అవుతోంది. వివిధ రకాల ప్లాస్టిక్ వ్యర్థాలు కొన్ని వందల సంవత్సరాల వరకు భూమిలో నాశనం కాకుండా నిల్వ ఉండి భూమి ఉత్పాదక శక్తిని తగ్గిస్తున్నాయి. పశుపక్ష్యాదులు వీటిని తినడం వల్ల చనిపోతున్నాయి. పెరుగుతున్న జనాభా, తరుగుతున్న ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ప్రమాదం. దీని ప్రభావం పర్యావరణంపై పడుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని పర్యావరణ పరిరక్షణకు పాలుపడాల్సిన అవసరం ఉంది.

# కాంచీపురం నారాయణి సిల్క్ షోరూం ప్రారంభం

## ముఖ్యఅతిథిగా యాంకర్ అనసూయ



**కాకినాడ, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాకినాడ మెయిన్ రోడ్లో నూతనంగా ఏర్పాటు చేసిన కాంచీపురం నారాయణి సిల్క్ షోరూమ్ సినీ నటి అనసూయ ముఖ్యఅతిథిగా విచ్చేసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కలంకారి పట్టు,మేరాకరి పట్టు, ఆరుని పట్టు, వింటేజ్ కలెక్షన్ వంపి అద్భుతమైన చీరలు ఈ నారాయణ సిల్క్ లో లభిస్తాయని తెలిపారు. పండుగలకు, పెళ్లి, ఇతర శుభకార్యాలకు సరసమైన ధరలలో నారాయణి వస్త్రాలను అందిస్తుందన్నారు. పట్టు, సిల్క్ చీరలు నారాయణిలో వివిధ రకాలలో ఉన్నాయని ఆమె చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ పన్నెండు వందల రూపాయలు నుండి 50 వేల రూపాయలు వరకు పట్టు వస్త్రాలు తమ షాపులో లభిస్తాయని తెలిపారు. అంతేకాకుండా వివిధ రకాలైన ఫ్యాన్సీ చీరలు కూడా తమ షాపులో లభిస్తాయి అని తెలిపారు.ఇక కార్యక్రమంలో నారాయణి సిల్బ్ షోరూం యాజమానులు కేశవ గుప్తా, సురేష్, ఉదయ్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎపిలో పలువురు నాన్ కేడర్ ఎస్పీల బదిలీ

**అమరావతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పలువురు నాన్ క్యాడర్ ఎస్పీ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. తాజా ఉత్తర్వుల ప్రకారం ఓ. దిలీప్ కిరణ్‌ను ఇంటెలిజెన్స్ విభాగానికి నియమించారు. టీ.టి. ప్రభాకర్‌బాబును సీఐడీ మహిళా రక్షణ సెల్‌కు పోస్టింగ్ ఇచ్చారు. డాక్టర్ వి.బి.ఆర్ రాజ్ కమల్‌ను కూడా ఇంటెలిజెన్స్ విభాగంలో నియమించారు. అదేవిధంగా కె. శ్రావణిని మెరైన్ విభాగానికి నియమించగా, డి. శ్రీ భవాని హర్షను పీఆర్ అండ్ ఆర్‌డీ శాఖ సీవోవోగా కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. కె. శ్రీలక్ష్మికి సీఐడీ యూఆర్‌సీసీ విభాగంలో కొత్త బాధ్యతలు అప్పగించారు. జే. రమేష్ రెడ్డిని సైబర్ క్రైమ్ విభాగానికి నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్ పోస్టును మార్పు చేసి సైబర్ క్రైమ్ విభాగానికి కేటాయించారు. ఈ బదిలీలకు సంబంధించి తదుపరి చర్యలు తీసుకోవాలని డీజీపీకి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

## మొదటి పేజీ తరువాయి

### సీ-ఫుడ్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానం



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆక్వా ఉత్పత్తుల నాణ్యతను పెంచుతామని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. దేశంలోని మత్స్యసంపదలో 28 శాతం ఏపీ నుంచే వస్తోందని చెప్పారు. విశాఖపట్నంలో 'నేషనల్ సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్'పై నిర్వహించిన వర్క్‌షాప్‌లో కేంద్రమంత్రి పీయూష్ గోయల్‌తో కలిసి సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడారు. సముద్ర ఉత్పత్తుల ఎగుమతులను పెంచడమే లక్ష్యంగా పెట్టుకున్నాం. పదేళ్లలో 5 శాతం నుంచి 70 శాతం పెరుగుదల కనిపించింది. తక్కువ వ్యవధిలో ఎక్కువ ఉత్పత్తులను ఎగుమతి చేసే స్థాయికి వెళ్లాం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతిలో దేశంలో ఏపీదే అగ్రస్థానం. రొయ్యల ఉత్పత్తిలో 66 శాతం, సీఫుడ్ ఆదాయంలో 38 శాతం మన రాష్ట్రం నుంచే వస్తోంది. రాష్ట్రంలో ఆక్వా ఉత్పత్తులు పెరిగేందుకు కేంద్రం అండగా నిలబడాలి. రొయ్యల ఉత్పత్తి మరింత పెరిగేందుకు ఏపీ అన్నివిధాలా అనుకూలం. విశాఖపట్నం, భీమవరం, కాకినాడ, నెల్లూరు, కృష్ణపట్నం ప్రాంతాలు ఆక్వా ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయి. రైతులు పొలాల్లో తీసిన కుంటలు కూడా సంపద సృష్టిస్తున్నాయి. రాష్ట్రంలో పారిశ్రామికవేత్తలకు ఎప్పుడూ డోర్లు తెరిచే ఉంటాయి. వారు ఎప్పుడైనా నన్ను కలవొచ్చు.. ఫోన్ చేసి రావొచ్చని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా కాకినాడ పోర్టును ఆధునికీకరణ చేస్తామని కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రకటించడంపై ముఖ్యమంత్రి హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర మత్స్యశాఖ ప్రాంతీయ కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని 15 రోజుల్లో ఇస్తామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'భారతదేశంలో మొత్తం చేపల ఉత్పత్తిలో ఏపీ వాటా 28 శాతంగా, రొయ్యల ఉత్పత్తిలో 66 శాతంగా ఉంది. దేశ సముద్రపు ఆహార ఎగుమతుల్లో ఏపీ నుంచే కేంద్రానికి దాదాపు 38 శాతం ఆదాయం వస్తోంది. సంవత్సరానికి రూ.28,000 కోట్లకు పైగా సీ-ఫుడ్ ఎగుమతులు ఏపీ నుంచే జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి చెందితే భారతదేశ సముద్ర ఆహార ఎగుమతులూ అభివృద్ధి చెందుతాయి. ఆక్వా రంగంలో ఏపీ ఆవిష్కరణలు చేస్తే భారతదేశ బ్లూ ఎకానమీ నిస్సందేహంగా ముందుకు సాగుతుంది. ప్రపంచవ్యాప్తంగా జరిగే సీ-ఫుడ్ బిజినెస్‌లో భారత్ వాటా కేవలం 5 శాతం మాత్రమే. ఈ రంగంలో దేశానికి పెద్దఎత్తున అవకాశాలు ఉన్నాయి. బ్లూ ఎకానమీ ద్వారా ఆర్థిక వృద్ధి సాధ్యం. నీరు ఉన్న చోట నాగరికతలు విలసిల్లుతాయి. ఏపీలో గోదావరి, కృష్ణ వంటి జీవనదులు ఉన్నాయి. భవిష్యత్ అంతా బ్లూ ఎకానమీదే' అని పేర్కొన్నారు. కాగా, ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబుతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, రాజీవ్ రంజన్ సింగ్, మంత్రులు అచ్చెన్నాయుడు, డోలా బాల వీరాంజనేయస్వామి, ఎంపీ బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

### వడ్డీరేట్లు యథాతథం

ఊరటనిచ్చే అంశం. అంతర్జాతీయంగా బలహీన డిమాండ్, రవాణా ఖర్చులు పెరగడం వంటివి ఎగుమతులకు సవాల్‌గా మారాయి. అయితే, దేశీయ ఆర్థిక కార్యకలాపాలు మాత్రం చాలావరకు స్థిరంగా ఉన్నాయి. 2026-27 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ వృద్ధి రేటు అంచనాలను 6.9శాతం నుంచి 6.6శాతానికి తగ్గిస్తున్నాం. రిటైల్ ద్రవ్యోల్బణం అంచనాలను కూడా 4.6 శాతం నుంచి 5.1శాతానికి పెంచుతున్నాం. విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ప్రభుత్వ సెక్యూరిటీల్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లకు నిబంధనలను సరళీకరించాం. ఈక్విటీ మార్కెట్‌లో ఎన్‌ఆర్‌ఐలు, ఓవర్సీస్ సిటిజన్స్ పెట్టుబడుల పరిమితిని పెంచాం. ఎక్స్ఛేంజ్ రేట్‌పై ఆర్‌బీఐ విధానాల్లో ఎలాంటి మార్పు లేదు. మన దేశీయ కరెన్సీ రూపాయికి నిర్దిష్టమైన రేటును నిర్ణయించాలనుకోవడం లేదు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో ఆర్థికంగా ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ఆర్‌బీఐ సిద్ధంగా, అప్రమత్తంగా ఉంది.

### మా హయాంలో 'లీక్'లు లేవు

రాగానే ఈ లీక్‌లు మొదలయ్యాయని ఆక్షేపించారు. పరీక్షల్లో అవకతవకల నేపథ్యంలో గతంలో తెలంగాణలో బ్యాన్ చేసిన కోఎంప్ట్ ( గ్లోబరీనా) కంపెనీకే కేంద్రం సీబీఎస్‌ఈ 12వ తరగతి ఆన్-స్క్రీన్ మార్కింగ్ (ఓఎస్ఎం) విధానాన్ని కాంట్రాక్ట్ ఇచ్చిందని కేజ్రీవాల్ మండిపడ్డారు. ఆ కంపెనీ తెలంగాణలో సృష్టించిన సమస్యల వల్ల 20మందికి పైగా విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. అటువంటి కంపెనీకి ఇంత పెద్ద సీబీఎస్‌ఈ కాంట్రాక్ట్‌ను ఇవ్వడం వెనుక ఏదో కుట్ర ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఈ చర్య వల్ల దేశంలో లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత జరిగినా ఆ కంపెనీపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని కేంద్రాన్ని ప్రశ్నించారు. ఇటువంటి అక్రమాలకు వ్యతిరేకంగా నిరసన చేపట్టాలని దేశ యువతకు కేజ్రీవాల్ పిలుపునిచ్చారు. పేపర్ లీక్‌లను అరికట్టడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకునేలా విద్యార్థులు, పౌరులు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురానంత వరకు ఈ సమస్య కొనసాగుతూనే ఉంటుందన్నారు. రేపటి తరం భవిష్యత్తు కోసం ప్రజలు పెద్ద ఎత్తున వీధుల్లోకి రావాలని విజ్ఞప్తి చేశారు. నీట్, సీబీఎస్‌ఈ పేపర్ వివాదాలకు బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

### మెగా డీఎస్సీలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు

తీర్పు మేరకు వర్టికల్ రిజర్వేషన్ విధానాన్ని క్రమపద్ధతిలో అమలు చేశామని తెలిపారు. ఏ కేటగిరీకి ఆ కేటగిరీలోనే పోస్టులు ఇచ్చామని, మెరిట్‌లిస్ట్ ప్రకారమే నియామకాలు జరిగాయని చెప్పారు. వివిధ విభాగాల్లో పోస్టుల భర్తీకి స్థిరమైన రోస్టర్ పాయింట్ లేదన్నారు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ విధానం వల్లే విమర్శలు వస్తున్నాయని చెప్పారు. "జీవో 77పై అనేక విమర్శలు వచ్చాయి. డీఎస్సీపై ఇటీవల అన్ని వివరాలతో ప్రకటన కూడా ఇచ్చాం. డీఎస్సీలో ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించలేదు. వర్టికల్, హారిజాంటల్ రిజర్వేషన్ల గురించి అందరూ తెలుసుకోవాలి. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడే ఏ పోస్టు ఎవరికో చెప్పేవారు. సుప్రీంకోర్టు తీర్పు తర్వాత కొన్ని మార్పులు వచ్చాయి. ఎంపికైనవారు సరిగానే సెలక్ట్ అయ్యారా? లేదా? అనేదే చూడాలి. హారిజాంటల్ రిజర్వేషన్ పద్ధతిపై సుప్రీంకోర్టు స్పష్టంగా చెప్పింది. ఎవరికైనా అసంతృప్తి ఉంటే ఉద్యోగం ఎందుకు రాలేదో స్పష్టంగా తెలుసుకోవాలి. స్పోర్ట్స్, దివ్యాంగుల కోటాపై రోస్టర్ పాయింట్లు ఉంటాయి. స్పోర్ట్స్ కోటాలో గతంలో సెపరేట్ పాయింట్ ఉండేది.. ఇప్పుడు లేదు. ముందుగానే నోటిపై చేసే పద్ధతి కూడా లేదు. ఎవరు ఏ కేటగిరీ నుంచి వచ్చారో అందులోనే పోస్టు భర్తీ చేస్తాం. కాల్ లెటర్ వచ్చినా సెలెక్ట్ కాకపోయేందుకు కారణాలు ఉంటాయి. వచ్చింది వెరిఫికేషన్ కాల్ లెటర్ మాత్రమే. ఎవరైనా రెండు, మూడు చోట్ల ఎంపికైనా ఒక్కచోటే తీసుకుంటారు. ఉద్యోగం ఇచ్చే విషయంలో ఒక్క తప్పు కూడా జరగలేదు" అని అధికారులు వివరించారు.

### సైకిల్ తొక్కిన ముఖ్యమంత్రి

చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించాలంటూ మొక్కని నాటారు. తిరుమలలో గ్రీనరీ త్వరలో 90 శాతానికి చేరుకోబోతోందని ఈ సందర్భంగా సీఎం అన్నారు. విశాఖ ఏయూలో మాత్రం కేవలం 25 శాతం మాత్రమే గ్రీనరీ ఉందని.. గ్రీనరీ పెంచేలా చర్యలు తీసుకోవాలని ఏయూ వీసీకి ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారు. మొక్కలు బాగా పెంచిన వాళ్లకే వచ్చే ఎన్నికల్లో టిక్కెట్లంటూ చంద్రబాబు సరదా వ్యాఖ్యానించారు. ఆంధ్రా యూనివర్సిటీని ఆదర్శంగా తయారు చేయాలని అన్నారు. చరిత్ర గల యూనివర్సిటీ.. ఎంతోమంది నాయకులు, విద్యావేత్తలు, ప్రముఖులను అందించిందని తెలిపారు.నెట్ జీరో కాన్సెప్ట్‌ను ఏయూలో ప్రవేశపెడుతున్నట్లు సీఎం చెప్పారు. వాతావరణ మార్పులపై అందరూ దృష్టి సారించాలన్నారు. యూనివర్సిటీకి కావాల్సిన 100శాతం విద్యుత్ ఇక్కడి నుంచే ఉత్పత్తి చేయాలన్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లో చెట్లను పెంచాలన్నారు. పిల్లలకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లుగా యూనివర్సిటీలను మార్చాలన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో కమిటీ ఆఫ్ ప్రొఫెసర్స్‌ను పెట్టి ఇన్‌హౌస్ నాలెడ్జ్‌ని అభివృద్ధి చేయాలని అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ అన్ని ఇతర కాలేజీలను గైడ్ చేయాలన్నారు. యూనివర్సిటీ అభివృద్ధికి బ్లూ ప్రింట్ తయారుచేస్తామని తెలిపారు. యాక్షన్ ఎ÷-లాన్‌లో విద్యార్థులు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. లెక్చరర్స్, స్టూడెంట్స్ అందరూ ఇందులో భాగస్వామ్యం కావాలన్నారు. పర్యావరణ దినోత్సవం సందర్భంగా తాను కూడా సైకిల్ మీద వెళ్తున్నట్లు ముఖ్యమంత్రి చెప్పారు. ఫొటోల కోసం కాదని.. ఒక అలవాటు కావాలనే ఉద్దేశంతోనే సైకిల్‌పై వెళ్తున్నట్లు తెలిపారు. సైకిల్ తొక్కడం వలన ఎక్సర్సైజ్, ఫిట్నెస్ రెండూ అవుతాయన్నారు. ఏపీలో 33శాతం గ్రీన్ కవర్ ఉందని.. దీన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యమన్నారు.

### బొల్లా బ్రహ్మనాయుడు కాంచీపురంలో అరెస్ట్

ఈ మేరకు సైబరాబాద్ పోలీసులు ఒక ప్రకటన విడుదల చేశారు. నకిలీ పత్రాల తయారీ, ఆర్థిక లావాదేవీలు, సంతకా ల దుర్వినియోగం తోపాటు ఈ కేసులో ఇతర కుట్రదారుల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు పేర్కొన్నారు. హైదరాబాద్ గండిపేటలో సర్వే నెం.18లోని సుమారు10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు బ్రహ్మ నాయుడు కుట్రపన్నారు. అందుకోసం నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ ప్రభుత్వ పత్రాలు సృష్టించారు. ఈ విషయాన్ని గుర్తించిన తహసీల్దార్ నార్సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో నార్సింగ్ పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నెం.990/2026గా కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే నిందితులుగా ఉన్న రాధాకృష్ణ, డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్, రాధాకృష్ణ, నిమ్మల కుటుంబ సభ్యులు కలిసి ఈ కుట్ర పన్నినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ భూమి కబ్జా కోసం రూ.12 కోట్ల మేర ఆర్థిక లావాదేవీలు జరిగినట్లు పోలీసులు గుర్తించారు. నిమ్మల కుటుంబానికి రూ.4 కోట్లు, రాధాకృష్ణకు రూ.4 కోట్లు, ఇతరులకు మరో రూ.4 కోట్లు చెల్లించినట్లు సమాచారం. నకిలీ పత్రాలు, ప్రభుత్వ అనుమతుల ద్వారా భూమిపై అక్రమ హక్కులు సృష్టించే ప్రయత్నం చేసినట్లు ఈ కేసు విచారణలో వెల్లడైంది. అయితే ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం బ్రహ్మనాయుడు హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసు తీవ్రతను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు మధ్యంతర బెయిల్ పిటిషన్‌ను తిరస్కరించింది. దీంతో బ్రహ్మనాయుడు తీవ్ర నిరాశ చెందారు. మరో వైపు భూమి వ్యవహారంలో తనపై కేసు నమోదు కావడంతో బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారు. అతడి కోసం పోలీస్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. చివరకు బ్రహ్మనాయుడు కాంచీపురంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించి.. అతడిని అరెస్ట్ చేశారు.

### పర్యావరణ పరిక్షణ అందరి బాధ్యత

మేరకు ప్రతి శుక్రవారం నో వెహికల్ డే పాటిస్తున్నామని ఆమె వెల్లడించారు. 'సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్‌తో పాటు మంత్రులందరం కాన్వాయ్ వెహికల్‌లను తగ్గించాం. అవకాశం ఉంటే పోలీసులంతా ఒకే వెహికల్లో వెళ్లే యోచన కూడా చేస్తాం. పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంటుంది. ప్రజా ప్రతినిధులంతా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తూ సైకిళ్లు తొక్కుతున్నాం' అని ఆమె తెలిపారు. పెట్రోల్, డీజిల్, బంగారం లాంటివి కొనుగోలు తగ్గించడం వల్ల విదేశీ మారక నిల్వలు పెరుగుతాయి. డాలర్‌తో రూపాయి విలువ తగ్గుతుంది. ఈ విషయాలను ప్రజలందరూ గమనించి పెట్రోల్, డీజిల్ వాడకాలు తగ్గించాలి. సైకిల్ తొక్కాలి అందరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని హోం మంత్రి వంగలపూడి అనిత పేర్కొన్నారు.


**ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్**
**(మునుపటి పేరు: శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)**

Truhome FINANCE

రిజిస్టర్డ్ కార్యాలయం: శ్రీనివాస టవర్, 1వ అంతస్తు, డోర్ నం.5, పాత నం.11, 2వ లేన్, సెనోటాఫ్ రోడ్, ఆల్వార్పేట్, చెన్నై – 600018
హెడ్ ఆఫీస్: లెవెల్ 3, వోక్హార్డ్ టవర్స్, ఈస్ట్ వింగ్ C-2 బ్లాక్, బాంద్రా కుర్లా కాంప్లెక్స్, బాంద్రా (ఈస్ట్), ముంబై – 400051 వెబ్‌సైట్: WWW.TRUHOMEFINANCE.IN

**లాంఛనప్రాయ స్వాధీనత నోటీస్**

ఈ క్రింద పేర్కొన్న ట్రూహూమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) అధీకృత అధికారి గారు సెక్యూరిటీకరణ మరియు ఆర్థిక ఆస్తులు పునర్నిర్మాణం మరియు భద్రతా వడ్డీ చట్టం, 2002 (పేర్కొన్న చట్టం) మరియు సదరు చట్టంలో ఇవ్వబడిన సెక్షన్ 13(12)లోని అధికారాలతో నియమం 3 సెక్యూరిటీవడ్డీ (ఎన్ఫోర్స్మెంట్) చట్టం 2002లో పేర్కొన్న నియమాలను అనుసరించి, ఈ క్రింద పట్టికలో ఉదహరించిన రుణగ్రహీతలకు రుణంతిరిగి చెల్లించుట కొరకు డిమాండ్ నోటీసు జారీ చేసినారు. ఆ తరువాత రుణగ్రహీతలు రుణం చెల్లించుటలో విఫలమైనారు, కావున రుణ గ్రహీతలకు మరియు సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా సదరు (చట్టం) లోని సెక్షన్ 13(4) రూలు 8 పేర్కొన్న చట్టం ప్రకారము ఈ దిగువ ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) సంతకందారు తేది 03-06-2026న దిగువ వివరించిన తనఖా ఆస్తిని లాంఛనప్రాయంంగా స్వాధీన పరచుకున్నారు. ఈ నోటీసు ద్వారా రుణగ్రహీతలకు, సాధారణ ప్రజలకు తెలియచేయునది ఏమనగా ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఇదివరలో శ్రీరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్) కంపెనీ వారు స్వాధీన పరుచుకున్న దిగువ పేర్కొన్న స్థిర ఆస్తిని యేవిధమైన లావాదేవీలు చేసిన యెడల కంపెనీకి కట్టవలసిన బాకీ మరియు వడ్డీకి లోబడి ఉండును. చట్టం యొక్క సెక్షన్ 13 సబ్-సెక్షన్ (8) ప్రకారం సెక్యూర్డ్ ఆస్తులను రీడీమ్ చేయడానికి నిర్ణీత సమయాన్ని రుణగ్రహీతల దృష్టికి తీసుకురావటమైనది.

| |
|---|
| **రుణగ్రహీత పేరు మరియు చిరునామా** |
| 1.శ్రీ కౌశిక్ రెడ్డి టి, తండ్రి: కిషోర్ రెడ్డి టి<br>2.శ్రీ కిషోర్ రెడ్డి టి, తండ్రి: సుబ్బా రెడ్డి<br>ఇద్దరూ నివాసం: ఫ్లాట్ నెం. 301, మైత్రి హోమ్స్, 6వ క్రాస్, లెక్చరర్స్ కాలనీ, మగుంట లేఅవుట్, పిరమిడ్ సమీపంలో, నెల్లూరు,నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 524003, భారతదేశం. |
| **డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం** |
| డిమాండ్ నోటీసు తేదీ - 13-01-2026.<br>లోన్ ఖాతా నెం. SHLHNELR0000752 & SHLHNELR0000754 రిఫరెన్స్ క్రింద 28-02-2026 నాటికి ఉన్న రూ. 2240959/- (ఇరవై రెండు లక్షల నలభై వేల తొమ్మిది వందల యాభై తొమ్మిది మాత్రమే) & రూ. 2270860/- (ఇరవై రెండు లక్షల డెబ్బై వేల ఎనిమిది వందల అరవై మాత్రమే) మొత్తానికి డిమాండ్ నోటీసు. |
| **తనఖా ఆస్తి వివరాలు** |
| శ్రీ పోని శ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా - నెల్లూరు సబ్-రిజిస్ట్రేషన్, నెల్లూరు రూరల్ మండలం, అంబాపురం గ్రామ పంచాయతీ పరిధి, అంబాపురం గ్రామం, ప్రస్తుతం నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో, నెల్లూరు బిట్-1 కొత్తూరు ఏరియా, సర్వే నెం. 1901A & 1901B, ప్రస్తుత వార్డు నెం. 2/53/457 వద్ద ప్లాట్లుగా వేయబడిన భూమి. రామకోటయ్య నగర్ ప్లాట్ నెం.197 సమీపంలో, 33 అంకణముల 24 చదరపు గజాల స్థలం, ఉత్తర దిక్కున 16.66 అంకణములు లేదా 133.25 చదరపు గజాల ఖాళీ స్థలం ఈ క్రింది వాటిచే సరిహద్దులుగా ఉంది:- తూర్పు: ప్లాట్ నెం.226లోని స్థలం. దక్షిణం: ఈ ప్లాట్‌లోని మిగిలిన స్థలం.<br>పడమర: లేఅవుట్ రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.482A.<br>ఈ సరిహద్దుల లోపల, దానిలోని అన్ని అనుబంధ హక్కులతో సహా 16.66 అంకణములు లేదా 133.25 చదరపు గజాల స్థలం..: |
| **రుణగ్రహీత పేరు మరియు చిరునామా** |
| 1.శ్రీమతి సావిత్రి ముడిరెడ్డి, భర్త: మల్యాద్రి ముడిరెడ్డి<br>2.శ్రీ మల్యాద్రి ముడిరెడ్డి, తండ్రి: మల్యాద్రి చిన్న మాలకొండయ్య<br>ఇద్దరూ నివాసం: డోర్ నెం. 1-1, లాడ్జ్ స్ట్రీట్, ప్రియదర్శిని జూనియర్ కాలేజ్ సమీపంలో, కలిగిరి గ్రామం & మండలం, నెల్లూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 524224, భారతదేశం. |
| **డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం** |
| డిమాండ్ నోటీసు తేదీ - 13-01-2026<br>డిమాండ్ నోటీసు మొత్తం రూ.1559069/-(పదిహేను లక్ష యాభై తొమ్మిది వేల అరవై తొమ్మిది మాత్రమే) 31-01-2026 నాటికి లోన్ ఖాతా నెం. SLPHNELR0000533 సూచన క్రింద. |
| **తనఖా ఆస్తి వివరాలు** |
| నెల్లూరు రిజిస్ట్రేషన్ జిల్లా, వింజమూరు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, కళిగిరి మండలం, కళిగిరి గ్రామం, బ్లాక్ నెం.7, నదిమూరు ఏరియా, డోర్ నెం. 1-1, అసెస్మెంట్ నెం. 269, సర్వే నెం.489, 1-25 సెంట్ల ఎకరాల విస్తీర్ణంలో, 0-05 సెంట్ల ఎకరాలు లేదా 242 చదరపు గజాలు లేదా 202.37 చదరపు మీటర్ల ఖాళీ స్థలంతో పాటు, అందులో 690 చదరపు అడుగులు లేదా 64.11 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఆర్.సి.సి స్లాబ్ ఇల్లు, అన్ని ఫిట్టింగ్‌లు & ఫిక్చర్‌లతో సహా, దానిలోని అన్ని సుఖభోగపు హక్కులతో సహా సరిహద్దులుగా ఉంది: తూర్పు: లక్కకుల బాబురావు స్థలం, దక్షిణం: షేక్ గుంపార్లపాటి మస్తాన్ స్థలం పడమర: రోడ్డు, ఉత్తరం: కె. గంగాధరామ్ స్థలం<br>ఈ సరిహద్దుల లోపల ఎకరాలు. 0-05 సెంట్లు, 242 చదరపు గజాలు లేదా 202.37 చదరపు మీటర్ల ఖాళీ స్థలం, దీనిలో 690 చదరపు అడుగులు లేదా 64.11 చదరపు మీటర్ల ఆర్.సి.సి. నిర్మాణం మరియు అన్ని అనుబంధాలు, విద్యుత్ మరియు పారిశుధ్య అమరికలు, నీటి కనెక్షన్ మరియు బావి సగం వాటాతో పాటు, ఈ ఆస్తికి సంబంధించిన అన్ని ఇతర సుఖభోగపు హక్కులతో సహా. |
| **రుణగ్రహీత పేరు మరియు చిరునామా** |
| 1.శ్రీ ఘౌస్‌బాషా షేక్, తండ్రి: మహబూబ్ బాషా షేక్<br>2.శ్రీమతి ఫర్వీన్ షేక్, భర్త: ఘౌస్‌బాషా షేక్<br>ఇద్దరూ నివాసం: డోర్ నెం. 24/518, గణేష్ స్ట్రీట్, మునిసిపల్ పార్క్ సమీపంలో, ప్రొద్దుటూరు పట్టణం, వైఎస్సార్ కడప జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 516360, భారతదేశం. |
| **డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం** |
| డిమాండ్ నోటీసు తేదీ-15-02-2026.<br>లోన్ ఖాతా నెం. SHLHTRPT0000687 రిఫరెన్స్ క్రింద 28-02-2026 నాటికి రూ.1103366/- (పదకొండు లక్షల మూడు వేల మూడు వందల అరవై ఆరు రూపాయలు మాత్రమే) మొత్తానికి డిమాండ్ నోటీసు. |
| **తనఖా ఆస్తి వివరాలు** |
| వై.ఎస్.ఆర్ జిల్లా, ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా, ప్రొద్దుటూరు టౌన్, మున్సిపాలిటీ ఏరియా, గ్రీన్ ల్యాండ్ అపార్ట్మెంట్, ఫ్లాట్ నెం.208, రెండవ అంతస్తు, సర్వే నెం.: 403/2బి, 404, విస్తీర్ణం 2352.6 చదరపు గజాలు, ఈ క్రింది సరిహద్దులతో: తూర్పు: సర్వే నెం.404 స్థలం మరియు రాస్తా.<br>దక్షిణం: ఎ.మహబూబ్ బీ గారి స్థలం, పశ్చిమం: సర్వే నెం.403 స్థలం<br>ఉత్తరం: ఎ.మహబూబ్ బీ గారి స్థలం<br>మొత్తం 2352.6 చదరపు గజాల విస్తీర్ణంలో 42.17 చదరపు గజాల స్థలం,<br>వై.ఎస్.ఆర్. జిల్లా ప్రొద్దుటూరు రిజిస్ట్రేషన్ జిల్లా ప్రొద్దుటూరు ఉప జిల్లా ప్రొద్దుటూరు టౌన్ మునిసిపాలిటీ ప్రాంతం మొదమీదపల్లి హరిజనవాడ వీధి, వార్డ్ నెం.20 మోడమీదపల్లి గ్రామ పొలాలు, గ్రీన్‌ల్యాండ్ అపార్ట్‌మెంట్, 2వ అంతస్తు ఫిటా నెం.208, R.C.C భవనం తూర్పు: ఓపెన్ స్పేస్, సౌత్: ఓపెన్ స్కై, వెస్ట్: కారిడార్ మరియు ఓపెన్ టు స్కై నార్త్: ఓపెన్ స్పేస్. మొత్తం: కార్ పార్కింగ్ R.C.C ఫ్లాట్‌తో సహా 1040 చదరపు అడుగుల R.C.C ఫ్లాట్.. |
| **రుణగ్రహీత పేరు మరియు చిరునామా** |
| 1.కుమారి చిట్టివేలు విష్ణు ప్రియ, తండ్రి: చిట్టి బాబు అలియాస్ రాధాకృష్ణ బాబు<br>2.శ్రీమతి శ్యామల సి, భర్త: చిట్టి బాబు అలియాస్ రాధాకృష్ణ బాబు<br>ఇద్దరి చిరునామాలు: డోర్ నెం. 26-15-395/23, సృష్టి విల్లాస్, ఇస్కాన్ సిటీ రోడ్,మహాదేవ ఇండోర్ స్టేడియం ఎదురుగా, కొండాయపాలెం, నెల్లూరు,ఆంధ్రప్రదేశ్ – 524003, భారతదేశం డోర్ నెం. 3-1007, నాగరి వీధి, ఇండియన్ బ్యాంక్ ఎదురుగా, శ్రీకాళహస్తి, తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 517644, భారతదేశం. ,డోర్ నెం./సర్వే నెం. 4/1, ఆర్‌సీసీ గ్రౌండ్ ఫ్లోర్, తొట్టంబేడు మండలం & గ్రామం,తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్ – 517640, భారతదేశం. |
| **డిమాండ్ నోటీసు ప్రకారం బకాయి మొత్తం** |
| డిమాండ్ నోటీసు తేదీ - 15-02-2026.<br>లోన్ ఖాతా నెం. SLPHNELR0000712 రిఫరెన్స్ క్రింద 28-02-2026 నాటికి రూ. 3049377/- (ముప్పై లక్షల నలభై తొమ్మిది వేల మూడు వందల డెబ్బై ఏడు మాత్రమే) మొత్తానికి డిమాండ్ నోటీసు. |
| **తనఖా ఆస్తి వివరాలు** |
| తిరుపతి జిల్లా, తొట్టంబేడు ఉప రిజిస్ట్రార్ కార్యాలయం, తొట్టంబేడు మండలం, తొట్టంబేడు గ్రామం, సర్వే నెం.4/1, పూర్తి 0-89 సెంట్ల ఎకరాలు లేదా 4307.6 చదరపు గజాల స్థలం మరియు RCC భవనానికి సరిహద్దులుగా ఉన్నవి:- తూర్పున: బండి బాట, దక్షిణాన: ఇతరుల ప్లాట్లు, పశ్చిమాన: చిట్టివేలు బాబు భూమి, ఉత్తరాన: చిట్టివేలు బాబు భూమి. భవనం కొలతలు: RCC గ్రౌండ్ ఫ్లోర్ తూర్పు నుండి పడమరకు 59 అడుగులు, ఉత్తర-దక్షిణానికి 63 అడుగులు, విస్తీర్ణం 3717 చదరపు అడుగులు - RCC మొదటి అంతస్తు తూర్పు నుండి పడమరకు 59 అడుగులు, ఉత్తర-దక్షిణానికి 63 అడుగులు, విస్తీర్ణం 3717 చదరపు అడుగులు, భవనం మొత్తం విస్తీర్ణం 7434 చదరపు అడుగులు. |

స్థలం: నెల్లూరు, తిరుపతి
కడప /కడప / ప్రొద్దుటూరు
తేది: 03-06-2026

సం/- అధికృత అధికారి – ట్రూహోమ్ ఫైనాన్స్ లిమిటెడ్
(మునుపటి పేరు శ్రిరామ్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్)

## మొక్కలు నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం

**కుప్పం,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పం ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో గురువారం ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల అధినేత నాగరాజు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని నిర్వహించడం ద్వారా ప్రకృతి సంరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడమే లక్ష్యమన్నారు. ప్రస్తుత పారిశ్రామిక యుగంలో పర్యావరణ సమతుల్యతకు తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విచక్షణారహితంగా చెట్లను నరికివేయడం వల్ల వాతావరణంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. భూతాపం పెరగడం, జీవ వైవిధ్యం క్షీణించడం, సముద్ర మట్టాలు పెరగడం, వర్షపాతం విధానాలలో మార్పులు వంటి పరిణామాలు ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్నాయని చెప్పారు. పర్యావరణ సంక్షోభానికి శాశ్వత పరిష్కారం పచ్చదనాన్ని పెంపొందించడమేనని ఆయన అభిప్రాయపడ్డారు. చెట్ల సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెరిగినప్పుడే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని తెలిపారు. ప్రకృతిని ప్రేమిస్తూ, పరిరక్షిస్తూ జీవించడం ద్వారా మాత్రమే మానవాళి మనుగడ సురక్షితంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ చర్యలతో పాటు విద్యార్థులు, యువత కూడా పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పర్యావరణ దినోత్సవాన్ని ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా ఏడాది పొడవునా పచ్చదనం పెంపొందించే ఉద్యమంగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ భాస్కరన్, పరిశోధన విభాగం డైరెక్టర్ కోదండరామయ్య, గ్రంథాలయ విభాగాధిపతి శ్రవణ్, హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతి మాధవన్, జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారి గంగాధరన్, సమన్వయకర్త అరుణ్ కుమార్, ప్రజా సంబంధాల అధికారి ప్రవీణ్ కుమార్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, జాతీయ సేవా పథకం వాలంటీర్లు పాల్గొన్నారు.

## పీఈఎస్ వైద్య కళాశాలలో జాతీయ క్యాన్సర్ విముక్తి రోగుల దినోత్సవం

**కుప్పం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జాతీయ క్యాన్సర్ విముక్తి రోగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని కుప్పంలోని పీఈఎస్ అనుబంధ సంస్థ జాతీయ క్యాన్సర్ నివారణ రోగుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా వైద్య నిపుణులు క్యాన్సర్ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ, ముందస్తు గుర్తింపు ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చని సూచించారు. వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హెచ్ ఆర్ కృష్ణారావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు, అధ్యాపకులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా క్యాన్సర్ వ్యాధి లక్షణాలు, కారణాలు, నివారణ మార్గాలు, చికిత్సా విధానాలపై ప్రత్యేక చర్చలు నిర్వహించారు. వైద్య నిపుణులు మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. ముఖ్యంగా పొగాకు వినియోగం, మద్యపానం, అనారోగ్యకర జీవనశైలి, కాలుష్యం వంటి కారణాలు క్యాన్సర్‌కు దారితీస్తున్నాయని తెలిపారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తిస్తే చికిత్స విజయవంతమయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు వివరించారు. అందుకోసం ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మహిళలు రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ పరీక్షలు, పురుషులు నోటి క్యాన్సర్ తదితర పరీక్షల పట్ల నిర్లక్ష్యం చేయరాదని తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య చైతన్యం పెంపొందించేందుకు ఇటువంటి దినోత్సవాల నిర్వహణ ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, క్యాన్సర్‌పై అపోహలను వీడి వైద్యుల సలహాలను పాటించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్య కళాశాల విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆటో డ్రైవర్‌లు అప్రమత్తంగా ఉండాలి

### - జన్ విశ్వాస్ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ



**పలమనేరు,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** స్థానిక ఎస్ వి సి ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద శుక్రవారం జన్ విశ్వాస్ అనే కార్యక్రమాన్ని పలమనేరు డి.ఎస్.పి డేగల ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ ధూడే, అడిషనల్ ఎస్పీ అరుణ్, హాజరైనారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.... చిత్తూరు జిల్లాలో జన్ విశ్వాస్ అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఇందులో ప్రధానంగా ఆటోలకు క్యూఆర్ కోడ్ ను ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా ఆటోలో ఎవరైనా అనుమానతులు వస్తే వారి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలన్నారు. ఇందులో ప్రధానంగా గంజాయి వంటి వాటికి ఆటో డ్రైవర్లు దూరంగా ఉండాలన్నారు. అదేవిధంగా కళాశాలల వద్ద ఎవరైనా ఈ టీజీ కు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా శ్రీ శక్తి యాప్ ను ప్రతి ఒక్కరూ డౌన్లోడ్ చేసుకోవాలన్నారు. ఎవరికైనా ప్రమాదం సంభవించినప్పుడు వెంటనే యాప్ ద్వారా పోలీసులకు సమాచారం వెళుతుంది. ఎక్కడైనా ఉంటే ఆ స్థలానికి వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ సిబ్బంది రావడం జరుగుతుందన్నారు. ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే పోలీసులకు సమాచారాన్ని చేరవేయాలన్నారు. అనంతరం వెహికల్ ఇన్స్పెక్టర్ మధుసూదన్ రావు మాట్లాడుతూ.... చిత్తూరు జిల్లాలో ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో రోడ్డుపై ప్రయాణించేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్ ను ధరించాలన్నారు. మీ కుటుంబాలను దించుకొని రోడ్డుపై ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలన్నారు. అనంతరం పలమనేరు డిఎస్పి డేగల ప్రభాకర్ మాట్లాడుతూ... పట్టణంలోని గోరి తోపు వద్ద ధైర్య స్పర్శ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు చాలా వరకు తగ్గాయని తెలిపారు. ఇందులో యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం ఒక ఆటోలో బంగారు దొరికితే దానిని నీతి నిజాయితీతో ఆటో డ్రైవర్ పోలీస్ స్టేషన్కు ఇవ్వడం జరిగిందన్నారు. అతన్ని చిత్తూరు జిల్లా ఎస్పీ శాలువా కప్పి సన్మానించారు. బాలికలు ఆటోలలో ప్రయాణించేటప్పుడు ఎవరైనా మిమ్మల్ని వేధించిన వెంటనే పోలీసులకు తెలియజేయాలన్నారు. బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. అనంతరం వార్డుల్లో ఎవరికైనా సమస్యలు ఉంటే సచివాలయ పోలీసులదగ్గరకు వెళ్లి సమస్యలు తెలియజేయవచ్చునన్నారు. అనంతరం చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ దూడే ను ఆటో డ్రైవర్లు పూలమాలలు వేసి శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం ఎస్పీ, అడిషనల్ ఎస్పీ లకు మెమొంటోలను పోలీసులు అందించారు. ఈ కార్యక్రమంలో సిఐలు మోహన్ రెడ్డి, రాంభూపాల్, పరశురాముడు, శ్రీనివాసులు, ఎస్సైలు లోకేష్ రెడ్డి, స్వర్ణ తేజ, చందన ప్రియ, మారెప్ప, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించకపోతే చర్యలు : ఎస్సై

**రామకుప్పం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పక పాటించాలని ఎవరైనా వాటిని అధిగమిస్తే కఠిన చర్యలు తప్పవని రామకుప్పం పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ వెంకట్ మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం అయిన రామకుప్పం పట్టణ ఆటో డ్రైవర్లకు క్యూఆర్ కోడ్ తో కూడిన గుర్తింపు ఆటో స్టిక్కర్లను ఆటో డ్రైవర్లకు పంపిణీ చేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు పరిమితికి మించిన ప్యాసింజర్లను ఎక్కించుకోవడం, అజాగ్రత్తగా ఆటో నడపడం, యూనిఫామ్ ధరించకుండా ఉండడం రోడ్డుకు అడ్డంగా ఆటోలను పార్కింగ్ చేయడం వంటి చర్యలు మానుకోవాలని ప్రయాణికులు పట్ల మంచిగా ప్రవర్తించి సద్భావంతో వారికి తమ సేవలు అందించాలని హితువు పలికారు. మండలంలో ఎక్కడైనా సరే పోలీస్ వారి పర్మిషన్ పొందిన ఆటోలు సంచరించాలని ఆటోలకు అన్ని వాహన డాక్యుమెంట్లు ఉంచుకున్న వారు వెంటనే పోలీస్ స్టేషన్లో తమ సిబ్బందిని సంప్రదించి క్యూఆర్ కోడ్ తో కలిగి ఉన్న గుర్తింపు కార్డులను మరియు స్టిక్కర్లను పొందాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్ల యూనియన్ నేతలు బిఎస్ రమేష్, రంగనాథ్, ఎం ఎం భాష, ముబారక్, పోలీస్ సిబ్బంది, పలువురు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

## పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం : సబ్ కలెక్టర్

**పుంగనూరు,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని ఎంపీడీ ఓ ఆఫీస్ ఎదురుగా శుక్రవారం పర్యావరణ దినోత్సవ సందర్భంగా సబ్ కలెక్టర్ చల్ల కళ్యాణి మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం భవిష్యత్ తరాలను కాపాడుకుందాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి, ఎం.ఆర్.ఓ రాము ఎంపీడీ ఓ అప్పాజీ ఆర్ ఐ పనింద్ర ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది, ఎంపీడీ ఓ కార్యాలయ సిబ్బంది, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రకృతి పరిరక్షణ మన అందరి బాధ్యత

**పుంగనూరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణలో భాగంగా నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి కార్యకర్త అమ్మ పేరుతో ఒక మొక్క నాటాలని అందులో భాగంగా పుంగనూరు మండల సమావేశం మరియు మొక్కలు నాటే కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పుంగనూరు పట్టణ బీజేపీ అధ్యక్షులు యం జగదీష్ రాజు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని తద్వారా కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మల్లికా రాణి అరవ పల్లి వెంకటరెడ్డి, చంద్ర శేఖర్ రాజు, టివిఎస్ ప్రసాద్, రమేశ్, డాక్టర్ జగన్నాథం, వెంకటేష్, నాగరాజ, రామకృష్ణ , కార్యకర్తలు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణతోనే ప్రజారోగ్య రక్షణ సాధ్యం

### - ఐఎంఏ పలమనేరు బ్రాంచ్ అధ్యక్షులు డా. యుగంధర్



**పలమనేరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) పలమనేరు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా పర్యావరణ పరిరక్షణ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐఎంఏ పలమనేరు శాఖ అధ్యక్షులు డాక్టర్ యుగంధర్ నాయకత్వం వహించారు. కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం, పర్యావరణ పరిరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించడం, కాలుష్యాల వల్ల మానవ ఆరోగ్యంపై కలుగుతున్న ప్రభావాలను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలమనేరు ఆర్.డి.ఓ. న్యాయమూర్తి, మున్సిపల్ కమిషనర్, వైద్యులు, ప్రభుత్వ అధికారులు, సామాజిక కార్యకర్తలు విద్యార్థులు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడిన డాక్టర్ యుగంధర్ మాట్లాడు తూ...ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కాలుష్యం మానవాళికి తీవ్రమైన ముప్పుగా మారిందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రతి సంవత్సరం జూన్ 5న నిర్వహించబడుతుందని పర్యావరణ పరిరక్షణపై ప్రపంచవ్యాప్తంగా అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్య సమితి ఆధ్వర్యంలో ఈ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారని ఆయన వివరించారు. ప్రకృతి సంపదలను కాపాడుకోవడం కాలుష్య నియంత్రణ వాతావరణ మార్పుల ప్రభావాలను తగ్గించడం, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందించడం ఈ దినోత్సవ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. డాక్టర్ యుగంధర్ మాట్లాడుతూ... ప్రస్తుతం ప్రపంచాన్ని వేధిస్తున్న ప్రధాన సమస్యలలో పారిశ్రామిక కాలుష్యం (ఇండస్ట్రియల్ పొల్యూషన్ ) ఒకటని తెలిపారు. పరిశ్రమల నుంచి విడుదలయ్యే విషవాయువులు, రసాయన వ్యర్థాలు గాలి, నీరు, నేలలను కలుషితం చేస్తున్నాయని చెప్పారు. ఫ్యాక్టరీల నుంచి వెలువడే కార్బన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్లు వాతావరణ నాణ్యతను దెబ్బతీస్తున్నాయని ఇవి శ్వాసకోశ వ్యాధులు గుండె సంబంధిత సమస్యలు, క్యాన్సర్ వంటి తీవ్రమైన అనారోగ్యాలకు దారితీస్తున్నాయని వివరించారు. పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను ఖచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అలాగే వాహన కాలుష్యం (వెహికల్ పొల్యూషన్ ) రోజురోజుకూ పెరుగుతూ ప్రజారోగ్యానికి ప్రమాదంగా మారుతోందని తెలిపారు. పెట్రోల్, డీజిల్ వాహనాల నుంచి విడుదలయ్యే పొగలో హానికరమైన రసాయనాలు ఉంటాయని ఇవి ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడుతున్న వారికి తీవ్ర ఇబ్బందులు కలిగిస్తాయని చెప్పారు. నగరాల్లో పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా గాలి నాణ్యత క్షీణిస్తోందని, ప్రజలు సాధ్యమైనంత వరకు ప్రజా రవాణా వ్యవస్థను వినియోగించడం సైకిళ్లు ఉపయోగించడం, మొక్కలు నాటడం ద్వారా కాలుష్యాన్ని తగ్గించవచ్చని సూచించారు. శబ్ద కాలుష్యం (నాయిస్ పొల్యూషన్ ) కూడా ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని డాక్టర్ యుగంధర్ తెలిపారు. అధిక శబ్దంతో నడిచే వాహనాలు, లౌడ్ స్పీకర్లు, పరిశ్రమలు, ఇతర యంత్రాల వల్ల శబ్ద కాలుష్యం పెరుగుతోందని చెప్పారు. దీని వల్ల వినికిడి సమస్యలు, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రక్తపోటు, గుండె సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు, ఆసుపత్రులు, నివాస ప్రాంతాల వద్ద శబ్ద కాలుష్యాన్ని నియంత్రించడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. నీటి కాలుష్యం (వాటర్ పొల్యూషన్ ) గురించి మాట్లాడుతూ పరిశ్రమల వ్యర్థాలు, ప్లాస్టిక్ వ్యర్థాలు మురుగునీరు చెరువులు, నదులు, భూగర్భ జలాలను కలుషితం చేస్తున్నాయని తెలిపారు. కలుషిత నీటిని వినియోగించడం వల్ల టైఫాయిడ్,కలరా,హెపటైటిస్ వంటి అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ నీటి వనరులను కాపాడుకోవాలని, నీటి వృథాను నివారించాలని ఆయన పిలుపునిచ్చారు. భూమి కాలుష్యం (ల్యాండ్ పొల్యూషన్ ) కూడా ప్రస్తుతం ఆందోళన కలిగించే అంశంగా మారిందని డాక్టర్ యుగంధర్ పేర్కొన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు, రసాయన ఎరువులు, ప్రమాదకర వ్యర్థాలు నేల సారాన్ని తగ్గిస్తున్నాయని చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడం, వ్యర్థాల వేరు నిర్వహణ, పునర్వినియోగ పద్ధతులను ప్రోత్సహించడం ద్వారా ఈ సమస్యను కొంతవరకు నియంత్రించవచ్చని వివరించారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్ ) తీవ్రమవుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గ్లోబల్ వార్మింగ్ కారణంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, వర్షపాతం విధానాలు మారుతున్నాయని, ప్రకృతి వైపరీత్యాలు అధికమవుతున్నాయని తెలిపారు. చెట్ల నరికివేత, ఇంధనాల అధిక వినియోగం,కాలుష్య ఉద్గారాలే ఈ పరిస్థితికి ప్రధాన కారణాలని చెప్పారు. పర్యావరణ పరిరక్షణలో మొక్కల పాత్ర ఎంతో కీలకమని పేర్కొంటూ కార్యక్రమంలో భాగంగా పలువురు అధికారులు, వైద్యులు, ప్రజలతో కలిసి డాక్టర్ యుగంధర్ మొక్కలు నాటారు. ఒక చెట్టు జీవితకాలంలో వేలాది కిలోల కార్బన్ డయాక్సైడ్‌ను గ్రహించి ఆక్సిజన్‌ను విడుదల చేస్తుందని, ప్రతి వ్యక్తి కనీసం సంవత్సరానికి ఒక మొక్క నాటి దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. పర్యావరణ పరిరక్షణపై భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, సురక్షిత మైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని వక్తలు పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి వ్యక్తి చిన్నచిన్న చర్యలు చేపడితేనే పెద్ద మార్పు సాధ్యమవుతుందని కార్యక్రమం ముగింపులో సందేశం ఇచ్చారు. పర్యావరణాన్ని కాపాడటం అంటే మన ఆరోగ్యాన్ని కాపాడటమేనని, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి పరిశుభ్రమైన పర్యావరణం అత్యంత అవసరమని డాక్టర్ యుగంధర్ తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై చైతన్యం పెంపొందించడంలో ముఖ్యపాత్ర పోషించిందని నిర్వాహకులు పేర్కొన్నారు.



# చిత్తూరు జిల్లా

## పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



**పలమనేరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ పలమనేరు మార్కెట్ యార్డు నందు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కె. రాజన్న మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా ప్రతి పౌరుడి బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి ప్రకృతిని ప్రేమించి కాలుష్య రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా పలమనేరు శాసనసభ్యులు ఎన్. అమర్నాథ్ రెడ్డిసారథ్యంలో "పచ్చని పలమనేరు పరిశుభ్రమైన పలమనేరు" నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణే భావితరాలకు మనం అందించే గొప్ప బహుమతి" అని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కె. రాజన్న, ఉపాధ్యక్షులు పి. దిలీప్ కుమార్, పాలకవర్గ సభ్యులు ఎస్. నదీమ్, మార్కెట్ యార్డు కార్యదర్శి వి. సంజీవ కుమార్, సిబ్బంది. కె. జ్ఞానాంబ, పి. లీలా, కే. అనీష్, పి. లోకేష్, ఆర్. భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటడాన్ని దైవకార్యంగా భావించండి



**పలమనేరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పలమనేరు ప్రకృతి కన్వీనర్ మల్లిచెట్ల దేవేంద్ర శ్రీపురం సీతారామయ్య ఆధ్వర్యంలో పలమనేరు మున్సిపల్ కమిషనర్, అటవీశాఖ అధికారులు సహకారంతో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగినదన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పలమనేరు ఆర్డిఓ భవాని, విచ్చేసి మొక్కలు నాటడం ద్వారా భావితరాలకు మంచి పర్యావరణాన్ని ఇవ్వవచ్చని తెలిపారు. పలమనేరు మునిసిపల్ కమిషనర్ రమణారెడ్డి,సబ్ డివిజనల్ ఫారెస్ట్ అధికారి వేణుగోపాల్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ చంప్లా నాయక్ మొక్కలు వలన కలిగే లాభాలు గురించి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్ మమతా రాణి, మాట్లాడుతూ.... సహజ వనరులను విచక్షణతో వాడుకోవాలని మొక్కలు నాటాలని కోరారు. దేవేంద్ర మాట్లాడుతూ....పట్టణంలోని మొక్కలను విద్యుత్ శాఖ అధికారులు కొట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అందర్నీ సమన్వయ పరచవలసిందిగా ఆర్డిఓని ,కమీషనర్ ని కోరడం జరిగినది. ఈ కార్యక్రమంలో పలమనేరు మున్సిపల్ మేనేజర్ ఖాదర్ మోహిద్దీన్,డాక్టర్ యుగంధర్,ఆసుపత్రి డైరెక్టర్లు నాగరాజు, సుధాకర్, అటవీ శాఖ సిబ్బంది.పుర ప్రముఖులు సేగు నరసింహులు శెట్టి, వార్డు మెంబర్ కుమార్, ప్రజలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మొత్తం వివిధ రకాలుగా 14 మొక్కలు నాటడం జరిగిందన్నారు.

## రోజుకో సూక్తితో మేధో వికాసం



**పలమనేరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** విద్యార్థులకు రోజుకో సూక్తి నేర్పడం ద్వారా విలువలతో పాటు మేధో వికాసం కలుగుతుందని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి. తులసినాథం నాయుడు తెలిపారు. శుక్రవారం పలమనేరు గురుకుల పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణలో జ్ఞాన దీపాలు పుస్తకాలు, నీతి పద్యాలు పుస్తకాలను ఆయన ఉపాధ్యాయులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... పాఠశాలల్లో ప్రార్థన సమయంలో రోజుకో సూక్తి, సామెత చెప్పి వివరించడం ద్వారా విద్యార్థుల్లో మంచి విలువలు అలవడడంతో పాటు తెలుగు భాష పై అభిరుచి పెరుగుతుందన్నారు. పలమనేరు మండల విద్యాశాఖ అధికారి బాలసుందరం, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి మాట్లాడుతూ... వారానికి ఒక నీతి పద్యం నేర్పించినా సంవత్సరంలో పిల్లలు 50 పద్యాలు నేర్చుకుంటారన్నారు. అలా నేర్చుకున్న వారు అన్ని విషయాలలోనూ ముందుంటారన్నారు. అందుకే తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి వారు లక్షలాది పుస్తకాలను ఉచితంగా అందిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు మంచి విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లు శశికుమార్, సురేఖ వీ కోట, బైరెడ్డిపల్లి, బంగారు పాళ్యం మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సోయాబీన్స్ సాగుపై అవగాహన

**పలమనేరు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పట్టణంలోని లయన్స్ క్లబ్ నందు శుక్రవారం ఉదయం పలమనేరు నియోజకవర్గంలోని రైతులకు సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారి సహకారంతో వ్యవసాయ శాఖ సోయాబీన్ సాగుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా వ్యవసాయ అధికారి మురళి హాజరై మాట్లాడుతూ.... ఎస్ వి ఎఫ్ కంపెనీ వారు ఈ కాంట్రాక్ట్ ఫార్మింగ్ విధానంలో రైతుల చే పండించిన సోయాబీన్ ఉత్పత్తులను తాము కొనుగోలు చేస్తామని తెలిపారు. నికరంగా ఒక టన్నుకి 45వేలు రూపాయలు రైతులకు చెల్లిస్తామని తెలిపారు. సోయాబీన్ నూనె గింజల పంట మెట్ట భూములలో వర్షాధారం కింద లేదా ఒకటి రెండు తొడులలో పంట వేసుకోవచ్చునని తెలిపారు. ఈ పంట కాలం 90 నుండి 110 రోజులు కావున బీడు భూములలో కూడా ఈ పంట సాగును చేసుకోవచ్చని తెలియజేశారు. ఈ ప్రాంతానికి ఈ పంట మొదటిగా వేస్తున్నందున వ్యవసాయ శాఖ తరపున కంపెనీ వారి ప్రోత్సాహంతో రైతులకు ఉచితంగా విత్తనములు మార్కెటింగ్ అవకాశాలు కల్పించి రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. సోయాబీన్ సాగు పై యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యల గురించి వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. రైతులు తమ సందేహాలను వ్యవసాయ శాఖ అధికారులతో కంపెనీ ప్రతినిధులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఇన్చార్జ్ గీతా కుమారి, పలమనేరు బైరెడ్డిపల్లి వీకోట గంగవరం పెద్దపంజాణి వ్యవసాయ అధికారులు రైతు సేవా కేంద్రం సిబ్బంది. ఎస్ వి ఎఫ్ కంపెనీ తరపున మనోజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## కార్యకర్తల ఐక్యమత్యమే బలంగా స్థానిక ఎన్నికల్లో గెలుపు సాధిద్దాం


### - రాష్ట్ర గ్రంధాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి

**రామకుప్పం, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉన్న కార్యకర్తలు ఐక్యమత్యమే బలంగా ఉండి త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకోవాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ మునస్వామి పిలుపునిచ్చారు. శుక్రవారం రామకుప్పం మండల పరిధిలోని క్లస్టర్ నాలుగు పరిధిలోని విజలాపురం యూనిట్కు సంబంధించిన ముఖ్య నేతల కార్యకర్తల సమన్వయ కమిటీ సమావేశం ఆనిగానూరు శ్రీ వాసవి కన్యకపరమేశ్వరి కళ్యాణమండపంలో యూనిట్ ఇంచార్జ్ ఆర్ కె రామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. పలువురు తెదేపా ముఖ్య నేతలు మాట్లాడుతూ గత 20 సంవత్సరాల విమానాశ్రయ నిర్మాణ కల త్వరలో విజలాపురం పరిసర ప్రాంతాల్లో నెరవేరనున్నదనీ త్వరలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విమానాశ్రయ పనులను ప్రారంభించడమే కాకుండా పెద్ద ఎత్తున రామకుప్పం మండలంలో పరిశ్రమలు స్థాపించి యువతకు మరియు మహిళలకు ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నారని పేర్కొంటూ గత ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలలో సూపర్ సిక్స్ పథకాలను విజయవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి లబ్ధిదారునికి న్యాయం చేయడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు తీసుకెళ్లి వారిని తెలుగుదేశం పార్టీ మరియు ఎన్ డి ఏ కూటమి విజయానికి కారకులు కావడానికి సమయార్థం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేత శ్రీనివాస్ రెడ్డి , ఎంపీపీ సులోచన గురప్ప, క్లస్టర్ ఇంచార్జ్. నాగభూషణం, జిల్లా ఎస్సీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి జయశంకర్ , కో క్లస్టర్ శంకర్ చలం, మనష్, మహేంద్ర నాయుడు, కృష్ణారెడ్డి, భువన్ రెడ్డి,బాబు రెడ్డి, సుభాష్, యూనిట్ పరిధిలోని ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# పరిశ్రమలకు అనుగుణంగా నైపుణ్యాల అభివృద్ధి

**- ఆదిత్య'లో ఘనంగా ప్రారంభమైన మూడవ అంతర్జాతీయ సదస్సు - ముఖ్య అతిథిగా డాక్టర్ రోషన్ కె.శ్రీవాస్తవ్**

**మదనపల్లె,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో (ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ కాంటెంపరరీ ఇష్యూస్ ఇన్ సైన్స్,ఇంజ నీరింగ్ అండ్ టెక్నాలజీ, ఐసీసీఐసెట్ 2క26) 3వ అంతర్జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైనది. ఈ కార్యక్రమం రెండు రోజుల పాటు నిర్వహించబడుతుంది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డాక్టర్ రోషన్ కె.శ్రీవాస్తవ్ (ఐఐటీ తిరుపతి నవవిష్కర్ ఐ-హబ్ ఫౌండేషన్) హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాలలో జరుగుతున్న ఆధునిక పరిశోధనలు, ఆవిష్కరణలు మరియు పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు.పరిశోధన ద్వారా సమాజానికి ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ సదస్సులు అధ్యాపకులు, పరిశోధకులు మరియు విద్యార్థులకు తమ




పరిశోధన ఫలితాలను ప్రపంచ వేదికపై ప్రదర్శించే అవకాశాన్ని కల్పిస్తాయన్నారు. నూతన ఆవిష్కరణలకు ఇటువంటి సదస్సులు దోహదపడతాయని పేర్కొన్నారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాయుడు సభను ఉద్దేశించి మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రం మరియు సాంకేతిక రంగాలలో వేగంగా జరుగు తున్న మార్పులను అందిపుచ్చుకోవడానికి పరిశోధనా దృక్పథం ఎంతో అవసరమన్నారు. విద్యార్థులు పరిశోధన పట్ల ఆసక్తి పెంపొందించుకుని నాణ్యమైన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ గంగాధర్ రెడ్డి మాట్లాడుతూ దేశ విదేశాలకు చెందిన పరిశోధకులు తమ పరిశోధనా పత్రాలను ఈ సదస్సులో సమర్పించారని తెలిపారు.మొత్తం 100 పరిశోధనా పత్రాలు అందగా,నిపుణుల సమీక్ష అనంతరం 87 పత్రాలు ఎంపిక చేయబడి,అంతర్జాతీయ జర్నల్స్ అయిన ఇజస్టెమ్స్ మరియు ఐ.జె.ఎస్.టీలలో ప్రచురణకు ఆమోదించ బడ్డాయన్నారు.ఈ సదస్సుకు ఏబీవీ - ఐఐటీఎం గ్వాలియర్,ఐఐఐటి గౌహతి, జేఎన్టియుఎ అనంతపురం, విజ్ఞాన్ యూనివర్సిటీ నల్గొండ,ఎస్ఆర్ఐటి ప్రొద్దుటూరు తదితర ప్రముఖ విద్యాసంస్థల నుండి పరిశోధనా పత్రాలు అందడం విశేషమన్నారు.వివిధ సాంకేతిక రంగాలకు సంబంధించిన పరిశోధనలు,ఆవిష్కరణలు మరియు నూతన ఆలోచనలపై జరిగిన చర్చలు పరిశోధకులకు కొత్త దిశానిర్దేశం చేశాయని తెలిపారు.ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కళాశాల ప్రాంగణంలో ముఖ్య అతిథి డాక్టర్ రోషన్ కె.శ్రీవాస్తవ్ మరియు కళాశాల డైరెక్టర్ ఎస్.రామలింగారెడ్డి మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు.ప్రతి ఒక్కరూ పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని, మొక్కలను నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు.ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ ఆర్.రామ్మోహన్ రెడ్డి మరియు ప్రెసిడెంట్ ఎం.నాగమల్లా రెడ్డి సదస్సు విజయవంతంగా నిర్వహించిన రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ సభ్యులను అభినందించారు.దేశంలోని ప్రముఖ విద్యాసంస్థల నుండి పరిశోధనా పత్రాలు అందడం కళాశాల ప్రతిష్టను మరింత పెంచిందని పేర్కొన్నారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి అంతర్జాతీయ సదస్సులను నిర్వహించి పరిశోధన మరియు ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్లు, విభాగాధిపతులు (హెచ్.ఓ.డిలు), అధ్యాపకులు, పరిశోధకులు,వివిధ కళాశాలల నుండి వచ్చిన ప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని సదస్సును విజయవంతం చేశారు.



# అన్నమయ్య జిల్లా

## ఓటరు జాబితా సవరణలో బీఎల్ఓల పాత్ర కీలకం

**- జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి**




**మదనపల్లె,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం ను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించడంలో బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులు కీలక పాత్ర పోషించాలని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఎస్ ఐ ఆర్ -2026 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మదనపల్లె మండలంలోని ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో మదనపల్లె నియోజకవర్గానికి చెందిన బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులకు డివిజన్ స్థాయి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, నియోజకవర్గ తహసీల్దార్లు, బీఎల్ఓలు, బీఎల్ఓ సూపర్వైజర్లు హాజరయ్యారు.ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ, ఓటరు జాబితాల ఖచ్చితత్వం కోసం ఇంటింటి గణన ప్రక్రియను అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలని సూచించారు. బీఎల్ఓలు సేకరించిన గణన పత్రాలు, జత చేసిన స్వీయ ధృవీకరిత పత్రాలను బి ఎల్ ఓ/ఈ సి ఐ ఎన్ ఈటి మొబైల్ అప్లికేషన్ ద్వారా అప్లోడ్ చేయడంతో పాటు, అనంతరం అన్ని పత్రాలను సంబంధిత ఈఆర్ఓ/ఏఈఆర్ఓలకు రికార్డు నిమిత్తం సమర్పించాలని సూచించారు. ప్రతి అర్హ ఓటరు పేరు ఓటరు జాబితాలో సక్రమంగా నమోదు అయ్యేలా బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని డీఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తహసీల్దార్లు, ఎన్నికల శాఖ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి పర్యవేక్షకులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణలో అందరి భాగస్వామ్యం

**- ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పిలుపు**

**మదనపల్లె,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ పిలుపునిచ్చారు.శుక్రవారం ఫోర్డ్ సంస్థ ఆధ్వర్యంలో మదనపల్లె, పెద్దమండెం మండలాల్లో పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు.ఈ సందర్భంగా ఫోర్డ్ సంస్థ డైరెక్టర్ జల్లా లలితమ్మ మాట్లాడుతూ ఫోర్డ్ మరియు క్రై సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న ప్రపంచ పర్యావరణ అవగాహన క్యాంపెయిన్ రెండు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వాతావరణ వలయంలో జరిగే మార్పులు గురించి బాలల సంఘాల సభ్యులకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా బికేపల్లిలో,పంచరత్న మున్సిపల్ ప్రైమరీ స్కూల్ మున్సిపల్ కార్మికులచే పరిశుభ్రత కార్యక్రమాలలో నిర్వహించడం జరిగింది.శివాజీ నగర్ నందు బాలల సంఘాల సభ్యులచే ఇండ్లు,పాఠశాలలో మరియు అంగన్వాడీ కేంద్రాల ప్రాంగణాలలో పచ్చదనం మరియు పరిశుభ్రత ఊహ చిత్రాలను గీయించడం జరిగింది.ముఖ్యంగా వాతావరణంలో మార్పులు నీరు,ఆహారం,గాలి కాలుష్యం,అకాల వర్షాలు,అతివృష్టి అనావృష్టి,చెట్లను నరికి వేయడం,అడవులకు నిప్పు పెట్టడం,విచక్షణ రహితంగా రసాయనాలు వినియోగం,ప్లాస్టిక్ వాడకం మొదలగునవి పర్యావరణానికి పెనుముప్పు కలుగుతుందన్నారు.అనంతరం ఐదవ వార్డ్ ఇన్చార్జ్ అయిన కొప్పల హరినాథ్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించి,మానవ మనుగడకు పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఫోర్డ్ సంస్థ నందు ఇంటర్న్షిప్ చేస్తున్న ప్రణవ్,సంస్థ సిబ్బంది నిర్మల,సుభాషిని, ప్రభావతి,జయలక్ష్మి, స్వర్ణకుమారి, ఎం.నరసింహ,బాలల సంఘాల సభ్యులు,మున్సిపల్ శానిటరీ వర్కర్స్,సచివాలయం సిబ్బంది మరియు కమ్యూనిటీ పాల్గొనడం జరిగింది.




## విద్యార్థుల కెరీర్‌లో నైపుణ్యాభివృద్ధి కీలకం

**- మిట్స్ వర్సిటీ సందర్శనలో ఎన్ఎస్‌డీసీ వైస్ ప్రెసిడెంట్ వరుణ్ బాత్రా**




**మదనపల్లె/ కురబలకోట, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీ ను జాతీయ నైపుణ్యాభివృధి సంస్థ (ఎన్ఎస్‌డీసీ), వైస్ ప్రెసిడెంట్ వరుణ్ బాత్రా, న్యూ ఢిల్లీ మరియు ఎథ్నోటెక్ అకాడమీ ఛైర్మన్ డాక్టర్ కిరణ్ రాజన్న, బెంగళూరు సందర్శించారు. మిట్స్ యూనివర్సిటీలో విద్యార్థుల నైపుణ్యాభివృద్ధికి అందుబాటులో ఉన్న వివిధ శిక్షణా కేంద్రాలు, ఆధునిక ప్రయోగశాలలు, ఇన్నోవేషన్ మరియు ఇంక్యుబేషన్ సెంటర్లు, పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ఏర్పాటు చేసిన సాంకేతిక సదుపాయాలను వారు పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ప్రెసిడెంట్ వరుణ్ బాత్రా మాట్లాడుతూ ఉన్నత విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా విద్యార్థుల కెరీర్‌లో కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. ఎన్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో అమలు చేస్తున్న పలు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను మిట్స్ విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానికి సహకరిస్తామని తెలిపారు. విద్యార్థులకు పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించే అవకాశాలు, స్కిల్ ఆధారిత కోర్సుల అమలు, పరిశ్రమ-విద్యా సంస్థల అనుసంధానం, ఉద్యోగ అవకాశాల పెంపు, ఇంటర్న్‌షిప్‌లు మరియు సర్టిఫికేషన్ కార్యక్రమాలపై విభాగాధిపతులతో చర్చించారు. అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా యూనివర్సిటీ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమం లో ఎగ్జిక్యూటివ్ మెంబెర్ టి జి రవి కుమార్, వైస్ ఛాన్సలర్ డాక్టర్ సి.యువరాజ్, రిజిస్ట్రార్ డాక్టర్ డి ప్రదీప్ కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రామనాథన్ లు పాల్గొన్నారు.

## సికె దిన్నె మండల తహసీల్దారుగా బీవీ మహేశ్వర్ రెడ్డి

**చింతకొమ్మదిన్నె ,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** చింతకొమ్మదిన్నె మండల నూతన తహసిల్దార్ గా బివి. నాగేశ్వర్ రెడ్డి బాధ్యతలు స్వీకరించారు.ఈయన గతంలో నంద్యాల జిల్లాలో పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా చింతకొమ్మదిన్నె మండలానికి బదిలీ అయ్యారు.ఇక్కడ పనిచేస్తున్న నాగేశ్వరరావు ను కడప కలెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు.

## ఆర్‌పిఐ మీడియా రాష్ట్ర చైర్మన్‌గా జ్యోతి జార్జి

**కడప అర్బన్ , జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆర్పీఐ (అత్వాలే) రాష్ట్ర ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా చైర్మన్ గా జ్యోతి జార్జి, రాయల సీమ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ గా దర్శి లక్ష్మీ చెన్నకేశవ రావు, లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గా విజయవాడకు చెందిన హైకోర్టు అడ్వకేట్ నాగదా సరి విజయ భాస్కర్ లు నియమి తులయ్యారు.గత గురువారం బెంగళూరు సిటీ లోని టౌన్ హాలు లో మైసూరు మహారాజ క్రిష్ణ రాజ్ వడియార్ 152 వ జయంతి, ఆపార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెం ట్ ఎం వెంకటస్వామి 72 వ జన్మ దిన వేడుకల సందర్భంగా దక్షిణ రాష్ట్రాల అధ్యక్షులు ఎన్ డి అజ య్ ప్రసన్న ఆధ్వర్యంలో హాజర య్యారు.ఇందులో బాగంగా వెంక టస్వామి చేతులు మీదుగా నియా మక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లా డుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను ప్రజలకు మరింత చేరువ అయ్యేలా కృషి చేయాలని చెప్పారు.ఇప్పటికీ దళిత, బడుగు, బలహీన వర్గాలు అన్నిరంగాల్లో వెనుక బడి ఉన్నారని, రాజ్యా ధికా రం దిశగా అడుగులు వేయాలని హితవు పలికారు, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించిన అజయ్ ప్రసన్న కు ధన్యవాదాలు తెలిపారు.




## సంక్షేమ పథకాల అమలే లక్ష్యంగా ఉర్దూ అకాడమీ

**- ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ బోర్డు సమావేశంలో మహమ్మద్ ఫరూక్ షుబ్లీ**



**మదనపల్లె,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ రాష్ట్ర ఉర్దూ అకాడమీ బోర్డు సమావేశం చైర్మన్ మహమ్మద్ ఫరూక్ షుబ్లీ అధ్యక్షతన అమరావతి లోని ఉర్దూ అకాడమీ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ వైస్ చైర్మన్ పఠాన్ ఖాదర్ ఖాన్ బోర్డు సభ్యులు మహబూబ్ బాషా , డైరెక్టర్ మహమ్మద్ గౌస్ పీర్ లు పాల్గొన్నారు.ఇందులో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి మరింత సమర్థవంతంగా తీసుకెళ్లే అంశంపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ముస్లిం మైనార్టీ వర్గాలకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు చేరేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు.అదేవిధంగా ఉర్దూ భాషాభివృద్ధి, విద్యా ప్రోత్సాహం, యువతకు అవకాశాల కల్పన, అకాడమీ కార్యక్రమాల విస్తరణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. అలాగే ఉర్దూ అకాడమీని మరింత బలోపేతం చేసే దిశగా సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని నిర్ణయించారు.మైనార్టీల అభ్యున్నతి, ఉర్దూ భాషాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థ అమలే లక్ష్యంగా ఉర్దూ అకాడమీ పనిచేస్తుందని సమావేశంలో నాయకులు స్పష్టం చేశారు.

## మధ్యాహ్న భోజన పథక వంట కార్మికులకు అవగాహన సదస్సు

**కేవీ పల్లి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన మరియు పౌష్టికాహారాన్ని అందించడమే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం యొక్క ముఖ్య ఉద్దేశమని కేవీ పల్లి మండల విద్యాశాఖాధికారి పి రెడ్డి భాషా పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేవీ పల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు మధ్యాహ్న భోజన పథక వంట కార్మికులకు ప్రత్యేక అవగాహన మరియు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి వంట కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశుభ్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని, వంట గదులను, వంట పాత్రలను ప్రతిరోజూ శుభ్రంగా ఉంచుకోవాలనీ, వంట చేసే ముందు, వడ్డించే ముందు కార్మికులు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలనీ సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన వీక్లీ మెనూ ప్రకారం ప్రతిరోజూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాలి. కూరగాయలు, గ్రుడ్లు మరియు అన్నం నాణ్యతలో ఎలాంటి రాజీ పడకూడదు. వంటకు ఉపయోగించే నీరు స్వచ్ఛమైనదిగా ఉండేలా చూసుకోవాలి. వంట చేస్తున్న సమయంలో ఎలాంటి అగ్ని ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలి. వంట గ్యాస్ సిలిండర్ల నిర్వహణపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని మండల విద్యా శాఖాధికారి తెలియజేశారు.

## మదనపల్లె తహశీల్దారుగా మాధవి



**మదనపల్లె, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మదనపల్లె తహశీల్దారుగా తుపాకుల మాధవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. పుంగనూరు డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న మాధవి పదోన్నతి పై మదనపల్లె కు బదిలీపై వచ్చారు. ఆమె విలేకరులతో మాట్లాడుతూ మదనపల్లె రెవెన్యూ మండలం చాలా పెద్దదని, ఇక్కడ రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరిస్తామన్నారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కబ్జా దారులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు.

## పటిష్టంగా యోగాంధ్ర 2026

**- ఈనెల 7 నుంచి 21 వరకు విస్తృత కార్యక్రమాలు : జేసి**

**మదనపల్లె, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):**రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 07 నుంచి జూన్ 21 వరకు నిర్వహించనున్న యోగాంధ్ర -2026 కార్యక్రమాలను జిల్లాలో పటిష్టంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో యోగాంధ్ర-2026 కార్యక్రమాల నిర్వహణపై సబ్ కలెక్టర్, ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా ఆయుష్ శాఖ అధికారులు, డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్, డీఆర్‌డీఏ, డ్వామా, జిల్లా పర్యాటక , ఐసీడీఎస్, జిల్లా విద్యాశాఖ, సర్వశిక్షా అభియాన్, జిల్లా క్రీడాశాఖ అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు తదితరులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూయోగా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సుకు సమగ్ర మార్గమని తెలిపారు. యోగా ద్వారా శరీరానికి బలం, సమతుల్యత పెరగడంతో పాటు మనస్సు ప్రశాంతంగా మారి ఒత్తిడి తగ్గుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని సూచించారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం- 2026 నిర్వహణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం శిక్షణలు, పౌరుల నమోదు, యోగా ప్రదర్శనలు, యోగా పోటీలు, అంతర్జాతీయ యోగా దినోత్సవం ఐదు ప్రధాన కార్యక్రమాలనుచేపడుతోందన్నారు.అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా జూన్ 21న అమరావతి వెస్ట్ బైపాస్ వద్ద 25 వేల మంది పాల్గొనే రాష్ట్రస్థాయి ప్రధాన కార్యక్రమంతో పాటు, ప్రతి జిల్లా కేంద్రంలో వెయ్యి మంది పౌరులతో జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో భారీ ఎత్తున ప్రజల భాగస్వామ్యంతో యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సూచించారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి యోగాంధ్ర- 2026ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో డిఆర్ఓ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్డీవో శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పర్యావరణ దినోత్సవం

**రామసముద్రం,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకుని రామ సముద్రం మండల కేంద్రంలోని స్వర్ణ కార్యాలయం, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో శుక్రవారం బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని నాయకులు పిలుపునిచ్చారు. చెట్ల పెంపకంతోనే కాలుష్యాన్ని తగ్గించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి నవీన్, నాయకులు చలపతి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

**- సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి**

**మదనపల్లె,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్నమయ్య జిల్లాలో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట వేసి, సామాన్య ప్రజల ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా పోలీస్ శాఖ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఈ మేరకు జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి శుక్రవారం మదనపల్లె లోని జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో, రవాణా, ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. రహదారి భద్రతపై పలు కీలక నిర్ణయాలు తీసుకున్న ఆయన మాట్లాడుతూ.. రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు వ్యవసాయ ట్రాక్టర్లకు తప్పనిసరిగా రేడియం రిఫ్లెక్టర్లు అమర్చాలని అధికారులను ఆదేశించారు. ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్



ధరించేలా చూడటంతో పాటు, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడే వారిపై, హై బీమ్ లైట్లతో ఎదురుగా వచ్చే వారి కళ్లు మిరుమిట్లు గొలిపేలా వ్యవహరించే వారిపై కొరడా ఝుళిపించాలని స్పష్టం చేశారు. అలాగే, జాతీయ రహదారుల వెంబడి ఉన్న నివాస ప్రాంతాల వద్ద ప్రమాదాలు జరగకుండా తగినంత వీధి దీపాల సదుపాయం కల్పించాలని సూచించారు. ఆర్టీసీ బస్సులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రయాణికులు ఎక్కేందుకు, దిగేందుకు నిర్దేశించిన బస్టాండ్లలో మాత్రమే ఆపాలని, రోడ్డు ఆక్రమణలను తక్షణమే తొలగించాలని ఆదేశించారు. రైతులు పొలాల కోసం పైప్‌లైన్ తవ్వకాల కారణంగా అనేక ప్రాంతాల్లో రహదారులు దెబ్బతిన్నాయని, వాటికి వెంటనే తగిన మరమ్మతులు చేపట్టి వాహనదారులకు ఇబ్బందులు, ప్రమాదాలు లేకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. వాహనదారులు లేన్ క్రమశిక్షణ పాటించేలా చూడటంతో పాటు, రాంగ్ రూట్‌లో ప్రయాణించే వారిలో మార్పు కోసం విస్తృత అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సాంకేతికతను జోడిస్తూ ఆధునిక ట్రాఫిక్ నిర్వహణ వ్యవస్థను (అడ్వాన్స్ ట్రాఫిక్ మేనేజ్మెంట్ సిస్టం) పటిష్టంగా అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతలో మార్పు తీసుకురావడానికి జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో "హెల్మెట్ లేకపోతే ప్రవేశం లేదు" (నో హెల్మెట్ - నో ఎంట్రీ) అనే నిబంధనను కఠినంగా అమలు చేయాలని ఎస్పీ గారు పిలుపునిచ్చారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా రవాణా అధికారి శ్రీ డి. అశోక్ ప్రతాప్, అన్నమయ్య జిల్లా డీఆర్‌బీఈఓ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి జి. అరవింద దేవి, జాతీయ రహదారుల డీఈఈలు శ్రీ పి. మధుసూదన (మదనపల్లె), శ్రీమతి సుజాత (చిత్తూరు), శ్రీ సి. నాగరాజ (రాయచోటి), మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్లు శ్రీ దినేశ్ చంద్ర, శ్రీ అజయ్ కుమార్, డీసీఆర్బీ సీఐ శ్రీ ఏ. ఆదినారాయణ రెడ్డి, డీటీఆర్బీ ఎస్ఐ శ్రీ డి. రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల వాడకం మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం

**సత్యవేడు, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** మాదకద్రవ్యాలు మానసిక ఆరోగ్యం, శరీరంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయని తిరుపతి జిల్లా సత్యవేడు ఐసిడిఎస్ సూపర్వైజర్ జ్యోతి స్పష్టం చేశారు. శుక్రవారం పేరడం అంగన్వాడీ కేంద్రంలో, కిషోర వికాసంపై బాలబాలికలకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సూపర్వైజర్ జ్యోతి మాట్లాడుతూ మద్యం సేవించడం మొదట్లో సరదాగా మొదలైన తదుపరి అది వ్యసనంగా మారుతుంది అన్నారు. దీర్ఘకాలికంగా మద్యాన్ని తీసుకోవడం వల్ల కాలేయం దెబ్బతినడం, గుండె సమస్యలు, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. పైగా ఇది మెదడు పనితీరును మందగించి, ఆలోచనా శక్తిని తగ్గిస్తుందని, గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదకద్రవ్యాల వినియోగం మెదడులోని నరాలను దెబ్బతీస్తాయని ఆమె వివరించారు.. మద్యం మానడానికి డిసల్ఫిరామ్ వంటి ట్యాబ్లెట్లు అందుబాటులో ఉన్నట్టు ఆమె గుర్తు చేశారు. మద్యపానం సేవించడం, డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉండాలని ఆమె కోరారు. అనంతరం దీనిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం దీప, ఎంఎల్ హెచ్పి మహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు హాజీరా, కస్తూరి, ఆశా వర్కర్ లలిత తదితరులు పాల్గొన్నారు.

## కుష్టు రోగులకు వాకింగ్ ఫ్రేవమ్స్, చేతికర్రలు పాదరక్షలు పంపిణీ

**తిరుపతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో శుక్రబారం తిరుపతి లోని అనంత సేన మరియు జ్యోతి లెప్రసీ కాలనీల నందు అర్హులైన కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం పొందిన వారికి వాకింగ్ ఫ్రేమ్స్, చేతి కర్రలు, ప్రత్యేకంగా తయారుచేసిన మైక్రో సెల్యులార్ రబ్బరు ఎం సి ఆర్ తో తయారు చేసిన పాదరక్షలు మరియు అవసరమైన డ్రెస్సింగ్ మెటీరియల్స్ అందజేయడం జరిగినది. ఈ సందర్భంగా డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ వి. బాలకృష్ణ నాయక్ గారు మాట్లాడుతూ కుష్టు వ్యాధి ద్వారా అంగవైకల్యం పొందినవారు ప్రతిరోజు అరికాళ్ళు మరియు అరిచేతులను నీటిలో నానబెట్టి శుభ్రపరచుకొని తర్వాత వేప నూనె పూసుకోవాలని, పుండ్లు ఉంటే డ్రెస్సింగ్ చేసుకోవాలని మరియు తీసుకోవాల్సిన స్వీయ జాగ్రత్తలను తెలియజేశారు మరియు వారికి రావాల్సిన అంగవైకల్య పెన్షన్లు వస్తున్నాయా లేదా అని విచారించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పి. శైలజ (జిల్లా కుష్టు ఎయిడ్స్ మరియు టీబీ అధికారి) డాక్టర్ రాజా (డిఎన్ఎమ్ఓ), మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ రాజేష్, డాక్టర్ వసుధ, ఆరోగ్య విస్తరణ అధికారి బాబు నెహ్రూ రెడ్డి, ఫిజియోథెరపిస్ట్ శ్రీరాములు నాయక్, డిపిఎంవోలు ముని సుబ్బరామిరెడ్డి, సుధాకర్ నాయక్ మరియు స్వచ్ఛంద కార్యకర్త రమణ మొదలగు వారు పాల్గొన్నారు.

## అరిణియార్ ఏరు నుండి ఇసుక అక్రమ రవాణాను అరికట్టండి
### -ప్రభుత్వానికి పిచ్చాటూరు మండల ప్రజల మొర

**తిరుపతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పిచ్చాటూరు మండల పరిధిలోని అరణియార్ ఏరు(కాలువ) నుండి యదేచ్ఛగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాను అరికట్టి తమ పంట పొలాలకు సాగునీటి కొరత లేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని పిచ్చాటూరు మండల ప్రజలు కోరుతున్నారు. శుక్రవారం తిరుపతి ప్రెస్క్లబ్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పిచ్చాటూరు మండల రైతులు కె చంద్రన్, జె బాబు, సుబ్రమణ్యం, యమునా నాధన్, బాలాజీ, ఢిల్లీ రెడ్డి, మనోహర్, విల్సన్ తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాం నుంచి నేటి వరకు ఆరణియార్ ఏటి నుంచి ఇసుక అక్రమ రవాణా రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్లు, లారీలు, హిటాచీ లతో తమిళనాడుకు అక్రమంగా తరలిస్తున్నారని వాపోయారు. 23 గ్రామాల కు సాగునీటి ఆధారమైన అరణియార్ ఏటి నుంచి ఇసుక అక్రమ రవాణా కారణంగా పంటలకు సాగునీరు కరువు అవుతుందని తమ సమస్యను జిల్లా కలెక్టర్కు, ఎస్పీకి, సంబంధిత తహశీల్దారు కు పరిసర ప్రాంతాల ప్రజలు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించ లేదని వారు పేర్కొన్నారు. ఈ నేపధ్యంలో ఎస్ఎస్బి పేట విలేజ్ పబ్లిక్ వెల్ఫేర్ అసోసియేషన్ సహజ వనరుల ధ్వంసం జరుగుతున్న తీరుపై చెన్నై లోని సదరన్ జోన్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్లో ఏప్రిల్ 2026 16న పిటిషన్ దాఖలు చేసి ఉన్నామని సదరు పిటిషన్ కు గ్రీన్ ట్రిబ్యునల్ (ఓఎస్ నెం,70/2026) స్పందించి ఇసుక, మట్టి, రోడ్డు గ్రావెల్ అక్రమ రవాణాను వెంటనే నిలుపుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేసించిందన్నారు. కోర్టు ఆదేశాలను కూడా లెక్క చేయకుండా ఏటి లోనే గ్రావెల్ రోడ్డు వేసి అక్రమ రవాణా కొనసాగిస్తున్నారని, అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వారు వాపోయారు. అక్రమ రవాణా కారణంగా బోర్లు ఎండి పోయి తమ పంట పొలాలకు సాగునీటి కొరతే కాకుండా ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడిందని వారు పేర్కొన్నారు, అక్రమ రవాణాను అడ్డుకుంటే మీ చేతనైంది చేసుకోండి అంటూ బెతిరింపులకు దిగుతున్నారన్నారు. విధి లేని పరిస్థితుల్లో తాము మీడియా ను ఆశ్రయించినట్లు చెప్పారు.

## విద్యా సంస్థల బస్సులపై రవాణా శాఖ ప్రత్యేక తనిఖీలు

**తిరుపతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి నగర పరిధిలో విద్యా సంస్థలకు చెందిన బస్సులపై రవాణా శాఖ అధికారులు శుక్రవారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. విద్యా సంస్థల ప్రాంగణాల్లో నిర్వహించిన ఈ తనిఖీలను మోటార్ వాహన తనిఖీ అధికారుల ఆరు బృందాలుగా ఏర్పడి నిర్వహించారు. ఇప్పటివరకు తిరుపతి జిల్లాలో సుమారు 850 విద్యాసంస్థల బస్సులను పరిశీలించగా, సాంకేతిక లోపాలు ఉన్న 75 వాహనాలకు నోటీసులు జారీ చేశారు. భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా అవసరమైన మార్పులు, మరమ్మత్తులు చేపట్టి వాహనాలను తిరిగి తనిఖీకి సమర్పించాలని సంబంధిత యాజమాన్యాలను ఆదేశించారు. మోటారు వాహనాల చట్టంలోని సెక్షన్ 185(+) ప్రకారం పాఠశాల మరియు కళాశాల బస్సులకు వర్తించే అదనపు భద్రతా నిబంధనల ప్రకారం 32 ప్రమాణాలను తప్పనిసరిగా అమలు చేయాలని అధికారులు సూచించారు. పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని బస్సులు అవసరమైన మరమ్మత్తులు పూర్తి చేసి, ఫిట్నెస్ సర్టిఫికెట్ పునరుద్ధరించుకొని మాత్రమే రోడ్లపై నడపాలని జిల్లా రవాణా శాఖ అధికారి సూచించారు. విద్యార్థుల భద్రత దృష్ట్యా మోటార్ వాహన చట్టాలు, నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని హెచ్చరించారు.. ఈ తనిఖీలలో మోట వాహన తనిఖీ అధికారులు సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, అతికా నాజ్, మోహన్ కుమార్, ఆంజనేయ ప్రసాద్, రమణ నాయక్ మరియు జిల్లాలోని మోటర్ వాహన తనిఖీ అధికారులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



**కమలానగర్ జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని అనంతపురం జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అనంతపురంలో జిల్లా కలెక్టర్ ఆనంద్, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సైకిల్ ర్యాలీతోపాటు పాదయాత్ర చేపట్టారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్డీటీ ఏఎఫ్ టెక్నాలజీ సెంటర్ వరకు ఈ కార్యక్రమం కొనసాగింది. ఈ అవగాహన ర్యాలీలో ప్రభుత్వ శాఖల అధికారులు, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు. భవిష్యత్ తరాల కోసం పర్యావరణాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణాన్ని రక్షించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపుమేరకు ప్రతి ఒక్కరూ ఈ-సైకిల్ వాహనాలను వినియోగించాలని కోరారు. అనంతపురం జిల్లాలో కోటి మొక్కలు నాటడమే లక్ష్యమన్నారు. ఇవాళ నగరంలోని పలు ప్రాంతాల్లో పదివేల మొక్కలు నాటనున్నట్లు తెలిపారు.

## ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన మరో లారీ



**మేదరమెట్ల జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటన శుక్రవారం కోరిసపాడు మండలం మేదరమెట్ల గ్రామ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోళ్ల దాణా లోడుతో విజయవాడ నుంచి ఒంగోలు వైపునకు వెళుతున్న లారీని డ్రైవర్ మేదరమెట్ల సమీపంలో జాతీయ రహదారి పక్కన నిలిపివేశారు. అదే సమయంలో అటుగా వస్తున్న మరో లారీ.. ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. సమాచారం అందుకున్న హైవే రక్షణ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాలను పక్కకు తొలగించి ట్రాఫిక్కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

## ప్రకృతిని కాపాడితేనే భవిష్యత్తు భద్రం
### -ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం

**తిరుపతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ పిలుపు మేరకు ప్రపంచ పర్యావరణ దినోత్సవం లో భాగంగా కపిలతీర్థం సమీపం లోని నగరవనంలో శుక్రవారం పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్యాన్ని కాపాడే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎన్ టి ఆర్ జిల్లా మూలపాడు నుండి రాష్ట్ర వ్యాప్తంగా పర్యావరణ దినోత్సవం కార్యక్రమంలో వర్చువల్ విధానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని నగరవనంలో అధికారులు, విద్యార్థులు, వాకర్స్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. డి ఎఫ్ ఓ పవన్ కుమార్, ఎఫ్ ఆర్ ఓ లు సుదర్శన్ రెడ్డి, మాధవి, దాదాపు 100 మంది విద్యార్థులు, ఏపీ గ్రీన్ క్రాప్స్, గోపాల్స్ వంటి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ప్రకృతి ప్రేమికులు మరియు అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు. అతిథులు, విద్యార్థులు, వాకర్స్ పర్యావరణ పరిరక్షణ పై అవగాహన ర్యాలీ నిర్వహించడంతో పాటు విద్యార్థులు, సిబ్బంది, తదితరులు సీడ్ బాల్స్ తయారు చేశారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థులు, యువత పాత్ర పై విద్యార్థులతో ఉప ముఖ్యమంత్రి ముచ్చటించారు. ఈ సందర్భంగా చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జీవ వైద్యాన్ని, పర్యావరణ పరిరక్షణ లో భాగంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున సీడ్ బాల్స్ తయారీ, వితరణ చేపట్టాలని సూచించారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2.5 కోట్ల సీడ్ బాల్స్ తయారు చేయాలని అందులో తిరుపతి జిల్లాలో 32.50 సీడ్ బాల్స్ లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అటవీ శాఖ పర్యావరణ పరిరక్షణ, జీవ వైవిధ్య సంరక్షణ మరియు ప్రజల భాగస్వామ్యాన్ని పెంపొందించాలనే సంకల్పాన్ని ప్రతిబింబిస్తుందని, ఈ భారీ సీడ్ బాల్ కార్యక్రమం రాష్ట్రంలోని హరితావరణాన్ని పెంచడంలో కీలక పాత్ర పోషించనుందని తెలిపారు.

## పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ
### -స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్

**తిరుపతి, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** వృక్షాలను సంరక్షించడం, ఎక్కువగా మొక్కలు నాటడం ద్వారా ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, తద్వారా మానవాళి మనుగడ సాధ్యమవుతుందని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) డీన్ డాక్టర్ అలోక్ సచన్ పిలుపునిచ్చారు. స్విమ్స్ కమ్యూనిటి మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్టు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీ పద్మావతి ఆసుపత్రి ప్రాంగణంలో పలురకాల మొక్కలు నాటారు. అనంతరం రోగులకు, వారి సహాయకులకు మజ్జిగ పంపిణీ చేశారు. ముఖ్య అతిథి డీన్ డాక్టర్ అలోక్ సచన్ మాట్లాడుతూ చెట్ల ద్వారానే పరిశుభ్రమైన గాలి, నీరు, ఆహారం లభిస్తుందని, తద్వారా ఆరోగ్యకర జీవనం సాధ్యమవుతుందని తెలిపారు.

## తిరుపతి కార్పొరేట్ లీగ్కు రోజురోజుకీ పెరుగుతున్న ఆదరణ
### - ఏ సి ఏ జాయింట్ సెక్రటరీ విజయ్ కుమార్
### - ఏపీసిపిఎస్ఈఏ, జేఎస్ఈఈ జట్లు విజయం

**తిరుపతి ,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతిలో మొట్టమొదటిసారిగా చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ నిర్వహిస్తున్న తిరుపతి కార్పొరేట్ క్రికెట్ మ్యాచ్లకు రోజురోజుకి ఆదరణ పెరుగుతున్నదని ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసిఏ)జాయింట్ సెక్రటరీ విజయ్ కుమార్ (క్రికెట్ విజయ్) అన్నారు. గొల్లవాని గుంటలో ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో శుక్రవారం మధ్యాహ్నం జరిగిన మ్యాచ్ కు ఆయన హాజరై మాట్లాడుతూ తిరుపతి కార్పొరేట్ లీగ్ రోజురోజుకి ప్రజల నుండి వస్తున్న ఆదరణ చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. 8 టీంలతో ప్రారంభించిన ఈ టోర్నని వచ్చే సంవత్సరం మరిన్ని టీములు పెంచి మరింత గొప్పగా నిర్వహిస్తామన్నారు. యూట్యూబ్ ద్వారా వేల సంఖ్యలో ఈ టోర్నిని ప్రేక్షకులు వీక్షిస్తున్నారని, క్రీడాకారులకు కూడా ఇది మరింత ఉత్సాహాన్ని పెంచుతున్నదని పేర్కొన్నారు. టోర్నీలో పాల్గొనే ప్రతి ఒక్కకు క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిసిఏ సెక్రటరీ సతీష్ యాదవ్, కోచ్లు చిన్నబాబు, అనిత, అంజి, ఫిజియో మీనా, జ్యోతి, ఏసీఏ క్యూరేటర్స్ నవీన్, ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి హోటల్స్ జట్టుపై ఏపీసిపిఎస్ఈఏ జట్టు విజయం

శుక్రవారం జరిగిన ఉదయం మ్యాచ్లో తిరుపతి హోటల్స్ ఏపీసిపిఎస్ఈఏ జట్టు విజయం సాధించింది. మొదట టాస్ ఓడి బ్యాటింగ్కు దిగిన ఏపీసిపిఎస్ఈఏ జట్టు నిర్నిత 20 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 160 పరుగులు చేసింది. 161 పరుగుల విజయలక్ష్మితో బరిలోకి జరిగిన తిరుపతి హోటలర్స్ జట్టు 18 ఓవర్లలో 124 పరుగులు మాత్రమే చేసి ఆల్ అవుట్ అయింది. దీంతో ఏపీసిపిఎస్ఈఏ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. జట్టులో అద్భుతమైన బౌలింగ్ వేసి నాలుగు వికెట్లు సాధించిన చిరంజీవి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. తాజ్ హోటల్ హెచ్ ఆర్ మేనేజర్ దీపక్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేశారు.

## పది రోజులుగా విద్యుత్ కరెంట్ కష్టాలు..!



**నందిగామ జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జగ్గయ్యపేట పట్టణంలో కొనసాగుతున్న విద్యుత్ సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. దాదాపు పది రోజుల క్రితం కురిసిన గాలివాన కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, తీగలు దెబ్బతిన్నాయి. వాటి మరమ్మతుల పనులు చేపడుతున్నామని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నప్పటికీ, రోజూ గంటల తరబడి విద్యుత్ సరఫరాను నిలిపివేయడం ప్రజల్లో అసంతృప్తికి దారితీస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు వివిధ ప్రాంతాల్లో తరచూ విద్యుత్ కోతలు విధించడంతో గృహిణులు, వ్యాపారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న ఈ సమయంలో విద్యుత్ లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు మరింత అవస్థలు ఎదుర్కొంటున్నారు. వ్యాపార కార్యకలాపాలు కూడా ప్రభావితమవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ కోతల ప్రభావం ప్రభుత్వ కార్యాలయాలపై కూడా పడుతోంది. ముఖ్యంగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రిజిస్ట్రేషన్ ప్రక్రియకు అంతరాయం కలుగుతోంది. రిజిస్ట్రేషన్ల కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని, దీంతో సమయం, ధనం వృథా అవుతున్నాయని పలువురు వాపోతున్నారు. మరమ్మతుల పనులు వేగంగా పూర్తి చేసి విద్యుత్ సరఫరాను సాధారణ స్థితికి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ముందస్తు సమాచారం లేకుండా విద్యుత్ కోతలు విధించడం వల్ల ఇబ్బందులు మరింత పెరుగుతున్నాయని పేర్కొంటున్నారు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ఉద్యోగాల పేరుతో మహిళకు రూ.4.5 లక్షల టోకరా.. ఇద్దరిపై కేసు నమోదు




**విజయవాడ , జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మాచవరం (విజయవాడ): ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించి ఒక మహిళను నిలువునా ముంచిన ఇద్దరు ఘరానా మోసగాళ్లపై విజయవాడ మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అంగన్వాడీ ఉపాధ్యాయురాలైన రుక్సానా బేగాన్కు నిందితులు వల వేశారు. వారిలో గణేశ్ అనే వ్యక్తి నూజివీడులో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆమె వద్ద నుంచి రూ. 1 లక్ష వసూలు చేశాడు. అంతటితో ఆగకుండా, ప్రతాప్ అనే మరో వ్యక్తి రైల్వేలో టీసీ (టికెట్ కలెక్టర్) ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి విడతల వారీగా రూ. 3.5 లక్షలు కాజేశాడు. మొత్తం దోపిడీ రూ. 4,50,000నెలలు గడుస్తున్నా ఉద్యోగాలు రాకపోవడం, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో తాను మోసపోయానని బాధితురాలు ఆలస్యంగా గ్రహించింది. దీనిపై ఆమె మాచవరం పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులు గణేశ్, ప్రతాప్లపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. నిరుద్యోగులు ఇటువంటి నకిలీ ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## చిన్నారుల సంక్షేమానికి కృత్రిమ మేధస్సు

**చింతకొమ్మదిన్నె , జూన్ 5 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** "పిల్లలే మన సంపద" అనే నినాదానికి మరింత బలాన్ని చేకూరుస్తూ, చిన్నారుల సమగ్ర అభివృద్ధి సంక్షేమంలో కృత్రిమ మేధస్సు సాంకేతికతను ఉపయో గించుకుని మెరుగైన ఫలితాలు సాధించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'నవచేతన' కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఇందులో భాగంగా, జిల్లా మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చింతకొమ్మదిన్నె మండలంలో పనిచేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలకు మొబైల్ అప్లికేషన్ వినియోగంపై రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విజయవంతంగా ప్రారంభమ యింది. ఈ శిక్షణా కార్యక్రమాన్ని శిశు సంక్షేమ శాఖ సీడీపీఓ శాంతమ్మ, చింతకొమ్మ దిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యా ధికారి డాక్టర్ రాఘవేంద్ర ల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిం చడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ 'నవచేతన' కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో విజయవంతం చేయడానికి అంగన్వాడీ సిబ్బంది అంతా సిద్ధంగా ఉన్నారని, కార్యకర్తలు ఈ రెండు రోజుల శిక్షణలో నేర్చుకున్న సాంకేతిక నైపుణ్యాలను ఉప యోగించుకుని, గ్రామాల్లో మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని ఆమె పిలుపు నిచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లల్లో సాధారణంగా కనిపించే ఎదుగుదల లోపాలు నత్తి వంటి మాటల సమస్యలు లేదా ఇతర ఏవైనా శారీరక, మానసిక అవలక్షణాలు గమనించినప్పుడు వెంటనే తమ ఆరోగ్య కేంద్రం దృష్టికి తీసుకురావాలన్నారు.

## సింగరాయకొండ వద్ద జీటీ ఎక్స్ప్రెస్పై రాళ్లదాడి..
### లోకో పైలట్కు తీవ్ర గాయాలు!



**విజయవాడ , జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గురువారం తెల్లవారుజామున సింగరాయకొండ రైల్వే స్టేషన్ సమీపంలో ఘోర ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న 12616 జీటీ (గ్రాండ్ ట్రంక్) ఎక్స్ప్రెస్ రైలు ఇంజిన్పై గుర్తు తెలియని దుండగులు రాళ్లతో దాడికి తెగబడ్డారు. ఈ దాడిలో ఒక భారీ రాయి ఇంజిన్ ముందు వైపు అద్దాన్ని (విండ్షీల్డ్) బద్దలు కొట్టుకుంటూ లోపలికి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్యూటీలో ఉన్న లోకో పైలట్ జయరామ్కు తీవ్ర గాయాలయ్యాయి. రాయి బలంగా తగలడంతో ఆయనకు తల, ముఖంపై తీవ్ర రక్తస్రావమైంది. గమనించిన రైల్వే సిబ్బంది వెంటనే ఆయనకు ప్రాథమిక చికిత్స అందించి, మెరుగైన వైద్యం కోసం విజయవాడ రైల్వే ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన ప్రాణాపాయం నుండి బయటపడ్డారని, కోలుకుంటున్నారని వైద్యులు తెలిపారు. పోలీసుల యాక్షన్: ఆర్పీఎఫ్ (రైల్వే రక్షణ దళం) పోలీసులు ఈ ఘటనపై కేసు నమోదు చేసి, నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. రైల్వే ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల నాయకులు ఆసుపత్రిలో బాధితుడిని పరామర్శించారు. రాత్రి వేళల్లో రైళ్లపై ఇలాంటి దాడులకు పాల్పడే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

## జమ్మలమడుగులో విషాదం..
### వైద్యం వికటించి తల్లీబిడ్డ మృతి



**జమ్మలమడుగు జూన్05 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** కడప జిల్లా జమ్మలమడుగులో విషాదకర ఘటన చోటుచేసుకుంది. వైద్యం వికటించి తల్లితోపాటు నవజాత శిశువు చనిపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు దిగారు. వివరాల్లోకి వెళ్తే.. జమ్మలమడుగు పట్టణం గడ్డ వీధికి చెందిన పఠాన్ రుక్సానా(28)ను మూడు రోజుల క్రితం డెలివరీ కోసం పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. శుక్రవారం ఉదయం రుక్సానాకు పురిటి నొప్పులు రావడంతో వైద్యులు చికిత్స అందించారు. చికిత్స అనంతరం.. ఆమె పరిస్థితి విషమంగా ఉంది.. ప్రొద్దుటూరు ఆసుపత్రికి తీసుకెళ్లాలని ఆస్పత్రి వైద్యులు భర్త అసిఫ్కు సూచించారు. భార్య బతికే ఉందని భావించిన భర్త ఆసిఫ్.. ఆమెను ప్రొద్దుటూరుకు తరలించారు. అక్కడ బాలింతను పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధరించారు. దీంతో తిరిగి అదే ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యుల నిర్లక్ష్యం వల్లే తల్లి, బిడ్డ మృతి చెందారని కుటుంబ సభ్యులు ఆరోపించారు. తమకు న్యాయం చేయాలంటూ ఆసుపత్రి ఎదుట మృతదేహంతో నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆందోళన చేస్తున్న వారికి పోలీసులు సర్దిచెప్పే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండాపోయింది. పోలీసులతో వారు వాగ్వాదానికి దిగారు. తమకు న్యాయం జరిగేంతవరకు మృతదేహాన్ని తీయమంటూ కుటుంబ సభ్యులు అక్కడే బైఠాయించారు.

# దూత మీద నమ్మకం నిర్మాతను చేసింది



హీరోలు నిర్మాతలు కావడం కొత్తేమి కాదు. చిరంజీవి పీక్స్ లో ఉన్నప్పుడే అంజనా ప్రొడక్షన్స్ స్థాపించారు. కార్డు నాగబాబు పేరు మీద కనిపించినా వెనుక ఉన్నది మెగాస్టారన్నది ఓపెన్ సీక్రెట్. ఏఎన్ఆర్ ఉన్నప్పుడే నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్ వ్యవహారాలు చూసుకునేవారు. వెంకటేష్ కు నేరుగా కాకపోయినా అన్నయ్య సురేష్ బాబు రూపంలో నిర్మాణం మీద ముందు నుంచి పట్టుంది. బాలకృష్ణ తన తండ్రి బయోపిక్ లో పార్ట్ నర్ గా ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటి జనరేషన్ లో ఇలా రిస్కు చేస్తున్న హీరోలు తక్కువే. వాల్ పోస్టర్ బ్యానర్ పెట్టిన మెల్లగా న్యాచురల్ స్టార్ నాని దాని రేంజ్ పెంచే పనిలో ఉన్నాడు. మహేష్ బాబు జిఎంబి పేరు మీద మేజర్ లాంటి ప్రాజెక్టు చేశారు. కిరణ్ అబ్బవరం ఇటీవలే ప్రొడ్యూసర్ రోల్ లోకి వచ్చేశాడు. నాగ శౌర్య లాంటి వాళ్లకు ఫ్యామిలీ బ్యానర్ అండదండలు ఎలాగూ ఉన్నాయి. ఇప్పుడీ లిస్టులో నాగచైతన్య చేరబోతున్నాడు. అమెజాన్ ప్రైమ్ లో మూడేళ్ళ క్రితం వచ్చిన దూత వెబ్ సిరీస్ సీజన్ 2తో నిర్మాతగా కొత్త పాత్రలోకి ప్రవేశించబోతున్నాడు. ఈ మేరకు ఇవాళ పూజా కార్యక్రమాలతో ఓపెనింగ్ చేశారు. గెస్టుగా నాగార్జున కూడా వచ్చారు. విక్రమ్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ హారర్ థ్రిల్లర్ వచ్చే ఏడాది స్ట్రీమింగ్ కు రావొచ్చు. ఎందుకంటే చైతు ప్రస్తుతం వృషకర్మలో బిజీగా ఉన్నాడు. అది రిలీజయ్యాక దూత 2 సెట్స్ లో అడుగు పెట్టొచ్చు. ప్రియా భవాని శంకర్ హీరోయిన్ గా నటిస్తుండగా మొదటి భాగంలో నటించిన కొందరు కీలక ఆర్టిస్టులు ఇందులో పాలు పంచుకోబోతున్నారు. చైతు చేయబోతున్న ఈ కొత్త ప్రయాణం ఎలా ఉండబోతోందో చూడాలి. శోభితని పెళ్లి చేసుకున్నాక కెరీర్ పరంగా రూటు మారుస్తున్నట్టు కనిపిస్తోంది. ఇవి ఫలితాలు ఇస్తే మంచిదే. నిర్మాతగా తన ముద్ర ఎలా ఉండబోతోందనేది దూత 2తో బయట పడనుంది. ఇదే కాదు త్వరలో సినిమా నిర్మాణంలోకి కూడా నాగచైతన్య అడుగు పెట్టబోతున్నట్టు సమాచారం. తండ్రి నాగ్, తమ్ముడు అఖిల్. మామ వెంకటేష్ తో పాటు రానా తదితరులంతా ఫ్యామిలీలోనే ఉన్నారు. సో లైనప్ బాగా ప్లాన్ చేసుకోవచ్చు.




## కొత్త నిప్పు రాజేసిన వీరభద్రుడు



ఎవరో జ్వాలలు రగిలించారు వేరెవరో దానికి బలి అయ్యారు అనే పాట ఊరికే పుట్టలేదు. గత నెల విడుదలై తమిళంలో మూడు వందల కోట్ల వైపు పరుగులు పెడుతున్న కరుప్పు అలియాస్ వీరభద్రుడు ఇప్పుడో కొత్త నిప్పు రాజేశాడు. ఇటీవలే దర్శకుడు ఆర్జె బాలాజీ తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ని కలుసుకున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ మొదట కరుప్పు విజయ్ కే వెళ్లిందని, ఆయన చివరి మూవీ ఇదైతే బాగుంటుందనే ఉద్దేశంతో కథ చెప్పానని అన్నాడు. ఇక్కడిదాకా బాగానే ఉంది ఎడిటర్ కలైవనన్ మరో సందర్భంలో మాట్లాడుతూ ఒకవేళ కరుప్పు విజయ్ కనక చేసి ఉంటే మరో స్థాయిలో ఉండేదని, బ్లాస్ట్ అయ్యేదన్న రేంజ్ లో ఎలివేషన్ ఇచ్చారు. ఇది కాస్తా సూర్య అభిమానులకు ఆగ్రహం కలిగించింది. కేవలం విజయ్ వద్దు అన్నందుకు వేరే ఆప్షన్ లేక సూర్యతో తీశారని, లేదంటే ఇంకా పెద్ద హిట్ అయ్యేదని అర్థం వచ్చేలా పైన రెండు స్టేట్ మెంట్లు ఉండటంతో సోషల్ మీడియా వేదికగా ఇదో కాంట్రావర్సీకి దారి తీసింది. ఇదంతా గమనించిన సూర్య నేరుగా కాకపోయినా ఇన్ డైరెక్ట్ గా ప్రేమతో ఉండండి అంటూ ఒక సాధారణ ట్వీట్ వేయడం ఇంకో చర్చకు దారి తీసింది. ఇది ఎక్కడికో వెళ్తుందని గుర్తించిన కలైవనన్ తన తప్పును సరిదిద్దుకుంటూ నేను అన్నది ఇంకో అర్థంలో వెళ్లిపోయిందని, మరోసారి ఇలా నోరు జారకుండా చూసుకుంటానని వివరణ ఇవ్వడం ఫైనల్ ట్విస్టు. ఆర్జె బాలాజీ సైతం సూర్య తనకు జీవితాన్ని ఇచ్చిన దేవుడిగా పలు సందర్భాల్లో వర్ణిస్తూ ఉంటారు. అయినా సినిమా ఇంత పెద్ద సక్సెస్ అయినప్పుడు హీరోని పొగుడుకోవాలే కానీ ఫలానా వాళ్ళు చేస్తే ఇంకా బాగుండేదని చెప్పడం ముమ్మాటికీ తప్పే. పైగా సూర్య కరుప్పుకి పూర్తి న్యాయం చేశాడు. క్లైమాక్స్ లో దేవుడిగా పూనకంతో చేసిన డాన్స్ అందరికీ నప్పేది కాదు. పైగా ఎంత విజయ్ అయినా ఆ స్థాయిలో చేయగలడా అంటే సమాధానం వెంటనే చెప్పలేం. తెలుగు రాష్ట్రాల్లో ముప్పై కోట్ల దాకా వసూలు చేసిన వీరభద్రుడు తాజాగా రిలీజైన పెద్ది వల్ల ఫైనల్ రన్ కు వచ్చేసింది.

## గ్లామర్ కోసమే జాన్వీ పాత్రలు సృష్టిస్తున్నారా



అతిలోకసుందరిగా దేశవ్యాప్తంగా ప్రేక్షకుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్న శ్రీదేవి అంటే ఎప్పటికీ చెక్కుచెదరని పేరు. అలాంటి గొప్ప నటికి వారసురాలిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన జాన్వీ కపూర్ హిందీలో పెర్ఫార్మన్స్ అవకాశం ఉన్న పాత్రలు చాలానే చేసింది. గుంజన్ సక్సేనా, గుడ్ లక్ జెర్రీ, మిలి, బవల్, ఉలజ్ లాంటి ఎన్నో అవకాశాలు సంపాదించింది. వీటి కమర్షియల్ లెక్కలు, హిట్టు ఫ్లాపు పక్కన పెడితే నటిగా తన సత్తా చాటినవే. ఇక మన తెలుగుకు వద్దాం. జాన్వీ ఇప్పటిదాకా చేసిన సినిమాలు రెండు. దేవరలో సెకండాఫ్ కే పరిమితం చేసిన దర్శకుడు కొరటాల శివ ఆమెను గ్లామర్ షోకు వాడుకోవడం తప్ప ఏమీ చేయలేకపోయారు. రెండు సాంగ్స్ తప్ప జాన్వీకి వ్యక్తిగతంగా ఒరిగిందేమి లేదు. బ్లాక్ బస్టర్ లో భాగమయ్యానన్న ఆనందం తప్ప. ఇప్పుడు పెద్ది వంతు వచ్చింది. స్టోరీ మళ్ళీ రిపీట్ అయ్యింది. అచ్చియమ్మగా పైట గాల్లోనే ఉంచేసే పాత్రలో దర్శకుడు బుచ్చిబాబు చేయమన్నది పొల్లు పోకుండా చేసి చూపించింది.

## ఆర్టిస్టులను ఇంకొంచెం వాడుకుని ఉంటే



పెద్దిలో అందరూ రామ్ చరణ్, జగపతిబాబు, శివరాజ్ కుమార్ పెర్ఫార్మన్స్ గురించి మాట్లాడుతున్నారు. అందులో ఆశ్చర్యం ఏమి లేదు. దర్శకుడు బుచ్చిబాబు ఈ క్యారెక్టర్లను తీర్చిదిద్దిన విధానం అలా కుదిరింది. అయితే కొంత మిక్స్డ టాక్ రావడం వెనుక క్యాస్టింగ్ ని సరిగా వాడుకోలేదనే కామెంట్స్ కూడా అభిమానుల నుంచి వినిపిస్తున్నాయి. ముఖ్యంగా ఫస్ట్ హాఫ్ లో ఎక్కువ కనిపించిన విలన్ దివ్యేందు శర్మ రెండో సగం క్లైమాక్స్ లో తప్ప మళ్ళీ ఎక్కడా కనిపించడు. రావు రమేష్ ఉన్నాడని ఫలానా సీన్ గుర్తు చేస్తే తప్ప సామాన్య ప్రేక్షకులకు ఫ్లాష్ కానంత తక్కువ నిడివి ఆయనకు పెట్టారు. పుష్పలో కూడా లెన్త్ ఎక్కువ లేకపోయినా మంత్రి, సిఎం క్యారెక్టర్ ద్వారా సుకుమార్ ఎలా వాడుకున్నారో తెలిసిందే. శ్రీకాంత్ అయ్యంగార్, జాన్ విజయ్ తదితరులకు గెటప్స్ ఘనంగా ఇచ్చారు కానీ పట్టుమని రెండు డైలాగులు లేవు. కమెడియన్ సత్య మాట్లాడేది కూడా చాలా తక్కువ. ఇలా ఎంతో మందిని బుచ్చిబాబు అలా టచ్ చేసి వదిలేశారనే మాట గట్టిగానే ఉంది. కేవలం రామ్ చరణ్ మీదే ఫోకస్ పెట్టకుండా మరికొన్ని థ్రెడ్స్ ద్వారా అందరినీ వాడుకునేలా కొన్ని మార్పులు చేసి ఉంటే టెంపో పెరిగేదన్న అభిప్రాయాన్ని కొట్టి పారేయలేం. జాన్వీ కపూర్ సైతం ఇంటర్వెల్ తర్వాత చాలా సేపు కనిపించదు. ఇదంతా కథానుసారం చేశామని టీమ్ చెప్పుకున్నా ప్రాముఖ్యత కలిగిన ఆర్టిస్టులు అంత సేపు స్క్రీన్ మీద కనిపించకుండా పోతే కనెక్టివిటీ తగ్గిపోతుంది. పెద్దికొచ్చిన సమస్యల్లో ఇదీ ఒకటని చెప్పక తప్పదు. దీని వల్ల పెద్ది ఎంతవరకు ప్రభావితం చెందిందనేది ఇప్పుడప్పుడే తేలదు. కనీసం వారం పది రోజులు వెయిట్ చేయాల్సి ఉంటుంది. చరణ్ లాంటి టాప్ హీరోకు మొదటి వీకెండ్ ఫుల్స్ పడటం పెద్ద విషయం కాదు. ఒకవేళ వీక్ డేస్ వచ్చాక కూడా ఆక్యుపెన్సీలు బలంగా ఉంటే పెద్ది చేతిలో సాలిడ్ బ్లాక్ బస్టర్ ఉన్నట్టే. ట్రేడ్ అయితే ఆ నమ్మకంతోనే ఉంది. స్క్రీన్ స్పేస్ వల్లనేమో ప్రమోషన్స్ లో జగపతిబాబు తప్ప వేరే ఏ ఇతర ఆర్టిస్టులు కనిపించలేదు కాబోలు.



# బిజినెస్ న్యూస్



## మరోసారి 300 మందికి ఉచిత వీసాలు



యూఏఈలో ఉపాధి పొందాలనుకునే వలస కార్మికులకు మరోసారి ఉచిత వీసాలను ఇప్పించేందుకోసం యూఏఈకి చెందిన ఏడీఎన్‌హెచ్, మన దేశానికి చెందిన జీటీఎం సంస్థలు రిక్రూట్‌మెంట్ మేళా నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నాయి. క్లీనింగ్ విభాగంలో 300 మందికి ఉచిత వీసాలు ఇచ్చేందుకు ఈనెల 12న సిరిసిల్ల, జగిత్యాల, 13న నిజామాబాద్, ఆర్మూర్‌లలో ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారు. 21 ఏళ్ల వయసు నిండి 40 సంవత్సరాలలోపు వారు ఈ ఇంటర్వ్యూలకు అర్హులు. ఎంపికైన వారికి ఉచితంగా వీసాలు ఇచ్చి, విమాన చార్జీలను సైతం కంపెనీయే భరించనుంది. భారత కరెన్సీలో నెలకు రూ.24 వేల వేతనం చెల్లిస్తూ.. నివాసం, భోజన సదుపాయాన్ని ఏడీఎన్‌హెచ్ కంపెనీ సమకూర్చనుంది. వివరాల కోసం సిరిసిల్ల 83320 17122, జగిత్యాల 83320 42299, నిజామాబాద్ 86868 60999, ఆర్మూర్ 83320 13999 నంబర్లలో సంప్రదించాలి. ఈ సందర్భంగా జీటీఎం సంస్థ చైర్మన్ సతీష్‌రావు 'సాక్షి'తో మాట్లాడుతూ ఉచితంగా వీసాలు జారీ చేసే అవకాశం తమ సంస్థకు రావడం ఎంతో విశేషం అన్నారు. వలస వెళ్లేవారిపై నయాపైసా భారం లేకుండా అన్ని వసతులు ఉచితంగా సమకూర్చడం తమ ప్రత్యేకత అని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.


## నష్టాల్లో ముగిసిన స్టాక్ మార్కెట్లు!



శుక్రవారం ఉదయం లాభాల్లో ప్రారంభమైన దేశీయ స్టాక్ మార్కెట్లు.. ట్రేడింగ్ క్లోజ్ అయ్యే సమయానికి, నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 116.66 పాయింట్లు లేదా 0.16 శాతం నష్టంతో 74,243.34 వద్ద, నిఫ్టీ 49.85 పాయింట్లు లేదా 0.21 శాతం నష్టంతో 23,366.70 వద్ద నిలిచాయి. అగ్రి-టెక్ (ఇండియా) లిమిటెడ్, ప్రిమో కెమికల్స్ లిమిటెడ్, రామ్‌కో సిస్టమ్స్ లిమిటెడ్, భగేరియా ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇండియా టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి కంపెనీలు టాప్ గెయినర్స్ జాబితాలో చేరాయి. జాగ్రన్ ప్రకాశన్ లిమిటెడ్, సువెన్ లైఫ్ సైన్సెస్ లిమిటెడ్, సన్‌ఫ్లాగ్ ఐరన్ ఉ స్టీల్ కంపెనీ లిమిటెడ్, వింధ్య టెలిలింక్స్ లిమిటెడ్, రవీంద్ర ఎనర్జీ లిమిటెడ్ వంటి కంపెనీలు నష్టాల జాబితాలో చేరాయి.

మార్కెట్ గురించి సాక్షి వెబ్‌సైట్‌లో నిపుణులు వెల్లడించే అభిప్రాయాలు వారి పరిశీలన, అంచనాలను బట్టి ఉంటాయి. ఇన్వెస్టర్లకు ఇది కేవలం విషయ అవగాహన మాత్రమే తప్ప..

## భారత్‌లో కొత్త ట్యాక్సీ సర్వీస్ - ప్రత్యేకతలివే!



వియత్నాంకు చెందిన మొబిలిటీ సర్వీస్ ప్రొవైడర్.. గ్రీన్ ఎస్ఎమ్, భారతదేశంలో గ్రీన్ ఎస్ఎమ్ లిమో ట్యాక్సీ సర్వీస్‌ను అధికారికంగా ప్రారంభించింది. ప్రస్తుతం ఈ సర్వీస్ కేవలం ఢిల్లీలో మాత్రమే అందుబాటులో ఉంది. తరువాత దశలవారీగా దేశం మొత్తం విస్తరించనుంది. గ్రీన్ ఎస్ఎమ్ కంపెనీ తన సేవలను వియత్నాం దేశంలో మాత్రమే కాకుండా.. లావోస్, ఫిలిప్పీన్స్, ఇండోనేషియాలలో కూడా విస్తరించింది. ఇప్పుడు భారతదేశంలో అడుగుపెట్టింది. సురక్షితమైన, నమ్మకమైన, అధిక నాణ్యత గల మొబిలిటీ ఎంపికను అందించడంతో పాటు.. డ్రైవర్లకు స్థానిక ఉపాధి అవకాశాలను కూడా కల్పించడమే తమ లక్ష్యమని కంపెనీ చెబుతోంది. గ్రీన్ ఎస్ఎమ్ లిమో అనేది.. ప్రయాణీకుల రవాణా కోసం అభివృద్ధి చేసిన ఏడు సీట్ల ఎలక్ట్రిక్ కారు. ఈ కార్లలో ప్రయాణికుల కోసం త్రాగు నీరు, వెట్ టిష్యూలు, ఇతర ప్రాథమిక సౌకర్యాలు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికుల భద్రత కోసం సంస్థ.. తమ వాహనాలలో 'సెక్యూర్-టు-సేఫ్' భద్రతా వ్యవస్థను అమర్చినట్లు వెల్లడించింది. గ్రీన్ ఎస్ఎమ్ లిమోలో కెమెరాలు, ఏఐ బేస్డ్ ఫీచర్స్ మాత్రమే కాకుండా.. డ్రైవర్లు, ప్రయాణీకులిద్దరి కోసం ఎమర్జెన్సీ సపోర్ట్ బటన్స్ ఉంటాయి. కాగా.. కంపెనీ తమ డ్రైవర్లకు ఎలక్ట్రిక్ వాహన నిర్వహణ, రహదారి భద్రత, కస్టమర్ సర్వీస్‌లో శిక్షణ ఇస్తామని కూడా పేర్కొంది. భారతదేశంలోని వినియోగదారులు యాప్ స్టోర్, గూగుల్ ప్లే రెండింటిలోనూ లభించే గ్రీన్ ఎస్ఎమ్ యాప్ ద్వారా గ్రీన్ ఎస్ఎమ్ లిమో రైడ్‌ను బుక్ చేసుకోవచ్చు.

## ఐసీఐసీఐ బ్యాంకుకు సెబీ హెచ్చరిక




దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఐసీఐసీఐ బ్యాంక్‌కు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ షాక్ ఇచ్చింది. వాలంటరీ రిటెన్షన్ రూట్(వీఆర్ఆర్) కింద స్థానిక రుణ సెక్యూరిటీల్లో విదేశీ పెట్టుబడులకు సంబంధించిన నిబంధనలను ఉల్లంఘించినందుకు సెబీ హెచ్చరిక లేఖ జారీ చేసింది. ఈ మేరకు ఐసీఐసీఐ బ్యాంక్ స్టాక్ ఎక్స్ఛేంజీలకు దాఖలు చేసిన ఒక ఫైలింగ్‌లో అధికారికంగా వెల్లడించింది.

**అసలేం జరిగింది?**

సెక్యూరిటీ కస్టోడియన్ గా వ్యవహరిస్తున్న ఐసీఐసీఐ బ్యాంక్ ఒక ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ (ఎఫ్‌పీఐ)కు నిబంధనలకు విరుద్ధంగా లబ్ధి చేకూర్చినట్లు సెబీ గుర్తించింది. వీఆర్ఆర్ ప్రోగ్రామ్ కింద దేశీయ బాండ్లలో పెట్టుబడి పెట్టిన సదరు విదేశీ ఇన్వెస్టర్, లాక్-ఇన్ పీరియడ్ పూర్తి కాకముందే తన నిధులను స్వదేశానికి తిరిగి తీసుకెళ్లేందుకు ఐసీఐసీఐ బ్యాంక్ అనుమతించింది.

**సెబీ అభ్యంతరం**

నిబంధనల ప్రకారం గడువు ముగియకుండా నిధులను వెనక్కి పంపడం ఆర్‌బీఐ, సెబీ మార్గదర్శకాలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేస్తూ సెబీ జూన్ 1న బ్యాంకుకు హెచ్చరిక లేఖ పంపింది. ఈ ఉల్లంఘనకు సంబంధించిన వివరాలను నిర్ణీత కాలపరిమితి లోగా ఎక్స్ఛేంజీలకు వెల్లడించడంలోనూ బ్యాంక్ విఫలమైంది. అనుకోకుండా జరిగిన ఆలస్యం వల్లే ఈ సమాచారాన్ని సకాలంలో సమర్పించలేకపోయామని బ్యాంక్ అంగీకరించింది.

**వీఆర్ఆర్ అంటే ఏమిటి? దాని ప్రాధాన్యత ఏంటి?**

భారతీయ ప్రభుత్వ, కార్పొరేట్ బాండ్ మార్కెట్లలో విదేశీ పెట్టుబడులను దీర్ఘకాలం పాటు నిలిపి ఉంచేలా ప్రోత్సహించడానికి ఆర్‌బీఐ 2019లో ఈ స్వచ్ఛంద నిలుపుదల మార్గాన్ని (వీఆర్ఆర్) ప్రవేశపెట్టింది. సాధారణ ఎఫ్‌పీఐ పెట్టుబడులపై ఉండే కఠినమైన నియంత్రణ అవసరాల నుంచి విదేశీ ఇన్వెస్టర్లకు ఈ మార్గం ద్వారా కొన్ని మినహాయింపులు లభిస్తాయి. అయితే, ఇందుకు ప్రతిగా సదరు విదేశీ ఇన్వెస్టర్ తమ పెట్టుబడుల్లో ఒక కనీస శాతాన్ని నిర్ణీత కాలం పాటు దేశంలోనే ఉంచేందుకు స్వచ్ఛందంగా కట్టుబడి ఉండాలి. కాగా, ఇటీవలే (ఫిబ్రవరిలో) కేంద్ర బ్యాంక్ ఈ ఎఫ్‌పీఐ పెట్టుబడుల కోసం వీఆర్ఆర్‌ను జనరల్ రూట్‌లో విలీనం చేస్తూ నిర్ణయం తీసుకుంది.

**ఐసీఐసీఐ బ్యాంక్ వివరణ**

సెబీ తీసుకున్న ఈ నియంత్రణ చర్యపై ఐసీఐసీఐ బ్యాంక్ స్పందించింది. ఈ హెచ్చరిక లేఖ కేవలం ఒక నిర్దిష్ట సమ్మతి లోపానికి సంబంధించినది మాత్రమేనని తెలిపింది. 'ఈ చర్య వల్ల బ్యాంకు ఆర్థిక స్థితిగతులపై ఎలాంటి ప్రభావం ఉండదు. బ్యాంకు దైనందిన కార్యకలాపాలు లేదా వ్యాపార నిర్వహణకు ఎలాంటి ఆటంకం కలగదు. భవిష్యత్తులో ఇలాంటి సాంకేతిక లోపాలు తలెత్తకుండా అంతర్గత నియంత్రణలను మరింత బలోపేతం చేస్తాం' అని చెప్పింది. బ్యాంకు మొత్తం పనితీరుపై గానీ, భద్రతపై గానీ దీని ప్రభావం ఏమాత్రం ఉండబోదని మేనేజ్‌మెంట్ ఇన్వెస్టర్లకు, ఖాతాదారులకు భరోసా ఇచ్చింది.

# అన్న క్యాంటీన్‌లను తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** అన్న క్యాంటీన్ లలో నాణ్యమైన ఆహారం ఐదు రూపాయలకే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అన్నారు. అన్నం దొరకకుండా పేదలు ఇబ్బంది పడకూడదనే ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్ లను నిర్వహిస్తోందని ఆయన చెప్పారు. శుక్రవారం మధ్యాహ్నం న్యూ బాలాజీ కాలనీ లోని అన్నా క్యాంటీన్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనిఖీ చేశారు. స్వయంగా భోజనం చేసి ఆహార నాణ్యతను ఆయన పరిశీలించారు. భోజనం చాలా బాగా ఉందని క్యాంటీన్ సిబ్బందిని అభినందించారు. భోజనం చేస్తున్న వారిని ఆహారం ఎలా ఉందని ఎమ్మెల్యే అడగగా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఎం ఆర్ పల్లి పంచాయతీ ఆఫీస్ వద్ద ఉన్న. అన్నా క్యాంటీన్ ను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తనిఖీ చేశారు. పరిసరాల శుభ్రత ను పరిశీలించారు. భోజనం చేస్తున్న వారిని ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరించి ఆహారం ఎలా ఉందని ప్రశ్నించగా మెజార్టీ ప్రజలు బాగుందని చెప్పారు. అయితే తాలింపు పలచగా ఉందని ఒక వ్యక్తి ఎమ్మెల్యేకి ఫిర్యాదు చేశారు. నాణ్యత పై సిబ్బంది మరింతగా శ్రద్ధ వహించాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రి పీయూష్‌కు సాదర వీడ్కోలు



**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రెండు రోజులు తిరుపతి జిల్లా పర్యటన ముగించుకుని శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం నుండి తిరుగు పయనమైన కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్ గోయల్ కు విమానాశ్రయం నందు అధికార,అనధికార ప్రముఖులు సాదరంగా వీడ్కోలు పలికారు. రెవెన్యూ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి మరియు జిల్లా ఇన్చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ డా,, ఎస్. వెంకటేశ్వర్, జిల్లా ఎస్పి ఎల్ సుబ్బారాయుడు, శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ బానుప్రకాష్ రెడ్డి జిల్లా అధికారులు తదితరులు కేంద్ర మంత్రి కి సాదర వీడ్కోలు పలికిన వారిలో వున్నారు.

# ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు అందరూ సహకరించాలి

## -కమిషనర్ (ఎఫ్.ఏ.సి.)శారదా దేవి




**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ప్లాస్టిక్ రహిత తిరుపతి స్థాపనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని నగరపాలక సంస్థ కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా శుక్రవారం ఉదయం నగరంలోని జీవకోన నందు పారిశుధ్య పనుల నిర్వహణ, రైతు బజార్ లో పారిశుధ్య పనులతో పాటు ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాల గురించి ప్రజలకు, వ్యాపారులకు అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగం తగ్గించి పర్యావరణ హితమైనవి వినియోగించాలని పిలుపునిచ్చారు. నగరంలో ఎక్కడైనా సింగిల్ యూస్ ప్లాస్టిక్ వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ లో భాగంగా నగరంలోని కాలువలు, నాలాలు శుభ్రం చేస్తున్నామని తెలిపారు. ఏ కాలువలో చూసినా ప్లాస్టిక్ కవర్లలో కట్టి వేసిన చెత్తచెదారం వస్తోందని తెలిపారు. కాలువల్లో చెత్త వేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య సిబ్బంది అన్ని ప్రాంతాల్లోని కాలువల్లో మట్టి, చెత్త తొలగించాలని తెలిపారు. రుతుపవనాల వలన కురిసే వర్షాలతో రోడ్లపై నీరు నిలవకుండా సజావుగా వెళ్లేలా తగుచర్యలు చెపట్టాలని సిబ్బందికి సూచించారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డి.ఈ.లు రమణ, మహేష్, శానిటరీ సూపర్ వైజర్లు చెంచయ్య, సుమతి, పారిశుధ్య విభాగపు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణం ప్రతి ఒక్కరి బాధ్యత

## -ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.లెనిన్ బాబు

**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా తిరుపతి లోని కోర్టు సముదాయంలోని ప్రత్యేక సబ్ జైల్ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఏర్పాటైన కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి లెనిన్‌బాబు ముఖ్య అతిథిగా జడ్జిగారు పాల్గొని జైలు ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని,ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటడం అలవాటుగా చేసుకోవాలని, దాని ద్వారా మన ఆరోగ్యంగా ఉంటామన్నారు. పర్యావరణం బాగుంటుందని, పర్యావరణం పరిశుభ్రంగా ఉంచుకోవాలని, మంచి అలవాటుగా అలవర్చుకోవాలని తెలిపారు. ప్రతి ఒక్కరు మొక్కలు నాటడం తో పాటు, ఆ మొక్కలని ప్రతిరోజు నీరు పోసి పెద్దవి అయ్యేవిధంగా చూసుకోవాలని తెలియజేశారు. వాహనాల నుండి వచ్చే కార్బన్ మోనాక్సైడ్ వంటి విష వాయువులను కూడా ఇది నివారిస్తుందని తెలియజేశారు. సబ్ జైల్లో మొక్కలను నాటి, ఖైదీలతో వారికి అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. సబ్ జైల్ లోపల సందర్శించారు. ఈ కార్యక్రమంలో సూపరిడెంట్ పాల్గొన్నారు.




# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

## -జూ పార్కులో పర్యావరణ పరిరక్షణ దినోత్సవం

**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్‌వి జూ పార్క్ క్యూరేటర్ అనురాగ్ మీనా అన్నారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో కలిసి తిరుపతి జంతు ప్రదర్శనశాల క్యూరేటర్ అనురాగ్ ఆసియాలోని అతిపెద్దదైన తిరుపతిలోని జంతు ప్రదర్శనశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. బావి తరాలకి మనం ఆక్సిజన్ అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తెలియజేశారు. ఫారెస్ట్ రేంజర్ జగదీష్ చంద్ర ప్రసాద్ మాట్లాడుతూ మన చుట్టూ ఉన్న పరిసరాలను పచ్చదనంతో నింపడం ద్వారా భావి తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నదని గుర్తు చేశారు. ప్రకృతిప్రకృతిని కాపాడుకుందాం అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

# తిరుమలలో ఏఐ ఆధారిత భక్తుల సేవల నిర్వహణ ప్రశంసనీయం

## - కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ పనితీరుపై హర్షం
## - ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో మొక్క నాటిన కేంద్ర మంత్రి

**తిరుమల, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుమలలో భక్తుల సేవల నిర్వహణలో కృత్రిమ మేధస్సు (ఏఐ), ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్న తీరు ప్రశంసనీయమని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. శుక్రవారం ఆయన తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా, టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర శ్రీవారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజేశారు.అనంతరం ఆలయం వెలుపల ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ద్వారా వసతి గదుల ఆక్యుపెన్సీ వివరాలు, భక్తుల రాకపోకలు, దర్శన క్యూ లైన్లు, లడ్డూ ప్రసాదాల పంపిణీ వంటి అంశాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించడం వల్ల భక్తులకు మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఈ కేంద్రం ద్వారా గదుల లభ్యత, వివిధ కంపార్ట్మెంట్లలో వేచి ఉన్న భక్తుల సంఖ్య, గంటల వారీగా తిరుమలకు చేరుకుంటున్న భక్తుల వివరాలు, లడ్డూ ప్రసాదాల



పంపిణీ సమాచారం తక్షణమే అందుబాటులోకి వస్తోందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సాంకేతికతను ప్రోత్సహిస్తూ రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ ప్రాజెక్టుకు సహకరించిన ప్రవాస భారతీయ భక్తులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, కేవలం 100 రోజుల లోపే ఏఐ ఆధారిత వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చిన టీటీడీ అధికారులను అభినందించారు. అంతకుముందు ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో పాల్గొని మొక్కను నాటారు. తిరుమలలో తన తల్లి పేరుతో మొక్క నాటడం ఎంతో సంతోషాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమం దేశవ్యాప్తంగా పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ప్రతి చిన్నారి తమ తల్లి పేరు మీద ఒక మొక్కను నాటి, జీవితాంతం దానిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించిన ఈ కార్యక్రమం పచ్చదనం పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని తెలిపారు. ప్రతి సంవత్సరం జూన్ మొదటి వారంలో తన జన్మదినం సందర్భంగా తిరుమలను సందర్శించి శ్రీవారి ఆశీస్సులు పొందడం ఆనవాయితీగా కొనసాగుతోందని చెప్పారు. దేశ సేవకు, ప్రజల సంక్షేమానికి మరింత కృషి చేసేలా శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం అధికారులు పాల్గొన్నారు.

# ప్రయోగాత్మకంగా ‘శ్రీవారి వైద్య సేవ’

## - వైద్య నిపుణులకు టీటీడీ ఆహ్వానం - టీటీడీ ఆసుపత్రుల్లో స్వచ్ఛంద వైద్య సేవలకు అవకాశం - ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించిన టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర



**తిరుమల, జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు టీటీడీ ఆసుపత్రుల్లో "శ్రీవారి వైద్య సేవ" కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర ప్రత్యేకంగా రూపొందించిన ఐటీ అప్లికేషన్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వైద్య నిపుణుల సేవలను శ్రీవారి భక్తులకు అందుబాటు లోకి తీసుకురావాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రయోగాత్మక దశలో కార్యక్రమాన్ని అమలు చేసి, పాల్గొనే వైద్య నిపుణుల నుంచి అభిప్రాయాలు సేకరించి మరింత మెరుగుపరిచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు విద్య, వైద్యం, ఐటీ తదితర రంగాల్లో సేవా భావంతో ముందుకు వచ్చే నిపుణులకు టీటీడీ వేదికగా నిలుస్తుందని పేర్కొన్నారు. టీటీడీ ఆసుపత్రులు, విద్యాసంస్థల్లో సేవలందించేందుకు వచ్చే నిపుణుల కు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన వసతి, భోజన సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో అమలు చేసి ఎక్కువ మంది నిపుణుల సేవలను వినియోగించుకునేలా చర్యలు చేపడతామని వివరించారు. ప్రత్యేకంగా రూపొందిం చిన ఐటీ అప్లికేషన్ ద్వారా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న శ్రీవారి భక్తులు, వైద్య నిపుణులు తమకు అనుకూలమైన తేదీల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సేవలందించవచ్చు. సూపర్ స్పెషాలిటీ వైద్య నిపుణులకు మూడు రోజుల పాటు, ఎంబీబీఎస్ వైద్యులకు ఏడు రోజుల పాటు స్వచ్ఛంద సేవ చేసే అవకాశం కల్పించనున్నారు. వీరికి తిరుమల, తిరుపతిలో వసతి, భోజన సౌకర్యాలు టీటీడీ ద్వారా అందించబడతాయి. అశ్విని ఆసుపత్రి, స్విమ్స్, బర్డ్ ఆసుపత్రి, ఆయుర్వేద ఆసుపత్రి, శ్రీ పద్మావతి చిన్నపిల్లల ఆసుపత్రి, ఎస్వీ గోశాల తదితర టీటీడీ అనుబంధ సంస్థల్లో వైద్య నిపుణులు తమ సేవలను అందించనున్నారు. హిందూ మతానికి చెందిన ఆసక్తిగల వైద్య నిపుణులు ఆన్‌లైన్ ద్వారా టీటీడీ వెబ్ సైట్ https://ttdevasthanams.ap.gov.in/srivari-seva/instructions లో తమ స్లాట్‌ను బుక్ చేసుకుని ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ప్రొఫెసర్ వెంకటాచలం, సికింద్రాబాద్ లోని కృష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఆర్‌వి శాస్త్రి, వైజాగ్ ఆంధ్ర మెడికల్ కాలేజ్ వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, బెంగళూరు ఈఎస్‌ఐ హాస్పిటల్ ఆర్థో హెచ్‌ఓడి డాక్టర్ పురుషోత్తం ఈవోతో వర్చువల్‌గా మాట్లాడి, టీటీడీ ఆసుపత్రుల్లో సేవలందించే అవకాశం కల్పించడం శ్రీవారి అనుగ్రహంగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఈవో సి.హెచ్. వెంకయ్య చౌదరి, జేఈఓలు (విద్య, వైద్యం) డాక్టర్ శరత్, వీరబ్రహ్మం, సీవీఎస్ఓ మురళీకృష్ణ, వివిధ ఆసుపత్రుల డైరెక్టర్లు, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కల సంరక్షణకు ప్రాధాన్యం

## -పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరం : జిల్లా కలెక్టర్




**తిరుపతి,జూన్ 05,(నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణ ఎంతో కీలకమని, పర్యావరణ పరిరక్షణలో యువత భాగస్వామ్యం అవసరమని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు.శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా రేణిగుంట (తూకివాకం) సమీపంలో తుడా ఆధ్వర్యంలో నిర్వహించిన వనమహోత్సవం కార్యక్రమంలో జిల్లా కలెక్టర్,జే సి ఆర్. గోవింద రావు, తుడా చైర్మన్ సి. దివాకర్ రెడ్డితో కలిసి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణకు, వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించడానికి ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలను చేపడుతోందన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటి సంరక్షణ, నీరు పోయడం, ఎరువులు, క్రిమి సంహారక మందులు వేయడం వంటి చర్యలు తీసుకోకపోతే మొక్కలు జీవించవన్నారు. చెట్ల సంరక్షణలో ప్రజలందరూ తమ వంతు భాగస్వామ్యం అందించాలని సూచించారు. ఈ సంవత్సరం ఎల్ నినో ప్రభావం కారణంగా ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగాయని, ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సీడ్ పెల్లెట్స్ కార్యక్రమాన్ని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ప్రారంభించారన్నారు. విత్తనాలను సహజ పదార్థాలతో (ఆవుపేడ, ఇతర జీవామృతాలు) కలిపి చిన్న గుళికల రూపంలో తయారు చేసి నాటడం ద్వారా వర్షాభావం ఉన్నా, నీరు తక్కువ ఉన్నా మొక్కలు ఎక్కువ కాలం జీవిస్తాయని, ఈ విధానం ద్వారా మొక్కల జీవన శాతం పెరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చెట్లు నాటడం ద్వారా వాతావరణాన్ని నియంత్రించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణలో విద్యార్థుల పాత్రను వివరించారు. పిల్లలు చిన్న వయసులోనే మొక్కలు నాటడం, వాటిని సంరక్షించడం అలవాటు చేసుకోవాలని, తద్వారా భవిష్యత్తులో పచ్చదనాన్ని పెంపొందించవచ్చని కలెక్టర్ పేర్కొన్నారు.జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మనిషి ఏ రంగంలో స్థిర పడినా పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఇంటి వద్ద, పాఠశాలల్లో, పొలాల్లో, ఖాళీ ప్రదేశాల్లో చెట్లు పెంచడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని సూచించారు.

# హార్ట్‌ఫుల్ మెడిటేషన్‌తో ఆనందకర జీవితం

## -జిల్లా ఎస్పీ.సుబ్బరాయుడు పిలుపు -ల్లా పరేడ్ మైదానంలో నిర్వహించిన యోగా, ధ్యాన సాధనల్లో పాల్గొన్న ఎస్పీ

**తిరుపతి,జూన్ 5 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరేడ్ మైదానంలో శుక్రవారం నిర్వహించిన "హార్ట్‌ఫుల్‌నెస్ మెడిటేషన్" కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ముఖ్య అతిదిగా పాల్గొన్నారు. పోలీసు సిబ్బందిలో శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ మరియు విధి నిర్వహణలో సామర్థ్యాన్ని పెంపొందించే లక్ష్యంతో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఎస్పీ యోగా మరియు ధ్యాన సాధనల్లో స్వయంగా పాల్గొని సిబ్బందికి ప్రేరణనిచ్చారు. అనంతరం సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, పోలీసు శాఖలో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది ప్రతిరోజూ ప్రజా సేవలో నిమగ్నమై ఉంటారని, విధి నిర్వహణలో బిజీగా ఉండటం వల్ల చాలామంది తమ ఆరోగ్యాన్ని



నిర్లక్ష్యం చేసే పరిస్థితులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు.ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ అత్యంత విలువైన సంపద అని, ముఖ్యంగా ఎక్కువ సమయం విధుల్లో ఉండే పోలీసు సిబ్బంది ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడం అత్యవసరమన్నారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా సమానంగా కాపాడుకోవాలని సూచించారు. యోగా ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక స్థైర్యం, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత పెంపొందుతాయని చెప్పారు. యోగా సాధన అనేక ఆరోగ్య సమస్యలను అధిగమించడంలో సహాయపడటమే కాకుండా, సానుకూల ఆలోచనా విధానాన్ని పెంపొందిస్తుందని వివరించారు.ఎవరైనా ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్నట్లయితే, యోగా మరియు ధ్యానాన్ని తమ దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని,మీ ఆరోగ్యం బాగుంటేనే ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందని సూచించారు..ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట రావు, రవి మనోహరచారి శ శ్రీనివాసులు, శ్రీనివాస రావు మరియు సబ్ డివిజన్ డీఎస్పీలు సిబ్బంది హార్ట్ ఫుల్ నెస్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No. 19-9-3A/1, Jayanagar, Ramanuja Circle, Tirupati - 517501 and Printed at SKYLINE Press, D.No. 19-9-3A/1, Jaya Nagar, Tirupati- 517501, Associate Editor: K. Neeraja, Ph:0877-2239899, email : netimanadesamdailytpt@gmail.com; Postal Reg. No TRP/139/2025-2027